

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్ గిరి | మంగళవారం | 06-10-2026 | సంపుటి: 3 | సంచిక: 242 | పేజీలు : 8 | వెల : 2/-
MEDCHAL-MALKAJGIRI | TUESDAY | 06-10-2026 | VOLUME : 3 | ISSUE : 242 | PAGES: 8 | COST: 2/-



విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575


## బకాయిల భారంతో
# ఖజానాపై ఒత్తిడి

- కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచులు, సరఫరాదారులకు రూ.51 వేల కోట్లకుపైగా బకాయిలు
- ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన మొత్తం రూ.14 వేల కోట్లకు చేరిక
- డీఏ, రిటైర్మెంట్ ప్రయోజనాల కోసం ఎదురుచూపులు
- జీతాలు, పెన్షన్లు, రుణాల వడ్డీలతో పెరుగుతున్న వ్యయం
- సంక్షేమం, అభివృద్ధి పనులతో సమతుల్యత సాధించడం ప్రభుత్వానికి సవాలు



**హైదరాబాద్, అక్టోబర్ 5:** తెలంగాణ ప్రభుత్వ ఖజానాపై బకాయిల భారం పెరుగుతోంది. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో గత ప్రభుత్వం నుంచి సుమారు రూ.40,154 కోట్ల బకాయిలు వారసత్వంగా వచ్చాయి. వాటిలో కొంత మొత్తాన్ని చెల్లించినప్పటికీ.. కొత్తగా పేరుకుపోతున్న బిల్లులతో పెండింగ్ మొత్తం తగ్గడం లేదు. కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచులు, సరఫరాదారులకు చెల్లించాల్సిన బకాయిలు ప్రస్తుతం రూ.51 వేల కోట్లకు పైగా ఉన్నట్లు సమాచారం.
కాంట్రాక్టర్లకు బిల్లులు అందకపోవడంతో రోడ్లు, నీటిపారుదల, ఇతర మౌలిక వసతుల పనులపై ప్రభావం పడుతోంది. పనులు పూర్తి చేసేందుకు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న చిన్న, మధ్యతరహా కాంట్రాక్టర్లు వడ్డీల భారాన్ని మోయాల్సి వస్తోంది. గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసిన మాజీ సర్పంచులు కూడా బిల్లుల కోసం ఆందోళన చేస్తున్నారు. దీంతో కొత్త పనులకు టెండర్లు పిలవడం, పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం కూడా ఇబ్బందిగా మారుతోంది. ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిల పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉంది. 2026 ఏప్రిల్ నాటికి ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బందికి చెల్లించాల్సిన బకాయిలు సుమారు రూ.14 వేల కోట్లుగా ఉన్నాయి. ఇందులో ఉద్యోగుల బకాయిలు రూ.6 వేల కోట్లు,

మిగతా 2వ పేజీలో..

## విద్యుత్ వినియోగదారులకు
# ట్రూ-అప్ షాక్

- నవంబర్ నుంచి యూనిట్‌కు 30 పైసలు.. డిసెంబర్ నుంచి 50 పైసలు
- రూ.5,420 కోట్ల భారం వినియోగదారులపై.. రైతులకు మినహాయింపు
- ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ పరిధిలో వేర్వేరు కాలపరిమితుల్లో వసూళ్లు
- బిల్లుల్లో ట్రూ-అప్ ఛార్జీలను ప్రత్యేకంగా చూపాలని ఈఆర్సీ ఆదేశం



**హైదరాబాద్:** తెలంగాణ విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం పడనుంది. గత ఆర్థిక సంవత్సరాల్లో విద్యుత్ కొనుగోలు వ్యయం, ఆదాయ

మిగతా 2వ పేజీలో..



## ఓటుకు నోటు కేసులో
# కీలక మలుపు

- సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్
- రేవంత్ రెడ్డి పిటిషన్‌పై వాడివేడిగా విచారణ

2

# 'సర్' వివాదంలో కీలక మలుపు!

- 'ఫామ్-6' మార్పులకు ఆమోదం లేదని సుప్రీం స్పష్టీకరణ
- ఎన్నికల కమిషన్ నిర్ణయాలపై సర్వోన్నత న్యాయస్థానం ఆరా
- పిటిషనర్ల ఆరోపణలపై కేంద్రం, ఎన్నికల కమిషన్ కు నోటీసులు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను సస్పెండ్ చేయాలన్న అభ్యర్థనకు నిరాకరణ
- 'నిర్ణయాలు ఏకాభిప్రాయంతోనో, మెజారిటీతోనో జరగాలి : పిటిషనర్లు
- రికార్డులు పరిశీలించిన తర్వాతే తేలుస్తామన్న ధర్మాసనం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 5 :** దేశంలో వోటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ('సర్')పై కొనసాగుతున్న వివాదం సోమవారం కీలక మలుపు తిరిగింది. 'సర్'కు సంబంధించిన నిర్ణయాలను ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్ల సమ్మతి లేకుండా ఏకపక్షంగా తీసుకున్నారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం, భారత ఎన్నికల కమిషన్‌తోపాటు సీఈసీ, ఇతర సంబంధిత అధికారులకు నోటీసులు జారీ

మిగతా 2వ పేజీలో..





## మెహదీపట్నంలో
# ఏసీబీ దాడి..

- రూ.4 లక్షల లంచం పట్టివేత
- రూ.8 లక్షలు డిమాండ్.. రూ.6.5 లక్షలకు ఒప్పందం
- తొలి విడతగా రూ.4 లక్షలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు
- సోదాల్లో మరో రూ.2.5 లక్షల లెక్కల్లో చూపని నగదు స్వాధీనం
- నిందితురాలిని ప్రత్యేక ఏసీబీ కోర్టుకు తరలింపు

3

## తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా
# అద్వైత్ కుమార్

- అదనపు బాధ్యతల స్వీకరణ

2



## ఏడాదిన్నరలోగా భూసర్వే
# పూర్తికి చర్యలు

- ఇళ్ల నిర్మాణానికి అటవీ భూముల అడ్డంకిపై రాష్ట్రస్థాయి భేటీ
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

2

## నిత్యావసర ధరలపై
# నియంత్రణ ఏదీ?



- ఆకాశాన్ని అంటుతున్న సన్న బియ్యం ధరలు
- రేవంత్ సర్కార్ నేల చూపులు : మాజీ మంత్రి హరీష్‌రావు

2



## రెండు నెలల్లో సింగరేణి సమస్యలు పరిష్కరించాలి

- లేకుంటే ఆమరణ దీక్ష చేస్తా : కవిత
- హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ నాయకుల సింగరేణి భవన్ ముట్టడి

2



## కీలక ప్రాజెక్టులకు
# కేంద్రం సహకరించాలి

- చింతన్ శివిర్‌లో గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి ప్రత్యేక భేటీ
- ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ మంజూరు చేయాలి
- ఎన్‌హెచ్ 65 6+2 లేన్ల విస్తరణ, ఆర్ఆర్ఆర్, హైదరాబాద్-అమరావతి ఎక్స్‌ప్రెస్‌వేపై చర్చ
- పర్వతమాల కింద 5 రోప్‌వేలు, సీఆర్ఐఎఫ్ కింద 33 పనులు
- 3 ఆర్వోబీ/ఆర్‌యూబీలకు మంజూరు కోరిన మంత్రి
- హైదరాబాద్-శ్రీశైలం ఎన్‌హెచ్-765పై ఎలివేటెడ్ కారిడార్‌కు ప్రత్యేక విజ్ఞప్తి

**గుజరాత్(ఏక్తానగర్), అక్టోబర్ 5 :** ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తమ రాష్ట్ర ప్రభుత్వం రోడ్ ఇన్ఫ్రాపై ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. గుజరాత్ రాష్ట్రం నర్మద జిల్లాలోని ఏక్తానగర్ స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణంలో జరుగుతున్న చింతన్ శివిర్ 2026 రెండు రోజుల కార్యక్రమాన్ని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ

మిగతా 3వ పేజీలో..

## మైనింగ్‌తో రామప్పకు
# ముప్పు అవాస్తవం

- సమగ్ర శాస్త్రీయ అధ్యయనం తర్వాతే మైనింగ్‌పై ముందుకు
- సింగరేణి యాజమాన్యం స్పష్టీకరణ

3

# ఓటుకు నోటు కేసులో కీలక మలుపు

- సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్
- బాధితుడిగా వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి
- రేవంత్ రెడ్డి పిటిషన్‌పై వాడివేడిగా విచారణ

**హైదరాబాద్, అక్టోబర్ 5:**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ తదుపరి విచారణను వాయిదా వేసింది. 2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ.50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్టు చేయడంతోపాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు. తనపై నమోదైన ఎఫ‌ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# ‘సర్’ వివాదంలో కీలక మలుపు!

మొదటిపేజీ తరువాయి

చేసింది. అయితే కేసు విచారణ పూర్తయ్యే వరకు జ్ఞానేశ్ కుమార్‌ను సీఈసీ బాధ్యతల నుంచి తప్పించాలన్న పిటిషనర్ల మధ్యంతర అభ్యర్థనను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం అంగీకరించలేదు. ఎదుటి పక్షం వాదన వినకుండా ప్రధానంగా వార్తా కథనాల ఆధారంగా ఇలాంటి తీవ్రమైన మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని కోర్టు స్పష్టం చేసింది.



**‘ఫామ్–6ను మార్చిందెవరు?’**

విచారణ సందర్భంగా కొత్త వోటర్ల నమోదుకు ఉపయోగించే ఫామ్-6 వ్యవహారం ప్రధానంగా చర్చకు వచ్చింది. సర్ మయంలో ఫామ్-6కు జత చేసిన కొత్త డిక్లరేషన్ కు సుప్రీంకోర్టు ఆమోదం ఉందన్న ఎన్నికల కమిషన్ గత వాదన నేపథ్యంలో సీజేఐ సూర్యకాంత్ కీలక స్పష్టీకరణ చేశారు. ‘మార్పులు చేసిన ఏ ఫామ్-6కూ మేము ఆమోదం ఇవ్వలేదు.. ఈ విషయంలో స్పష్టంగా ఉండాలి.. రికార్డులు వచ్చిన తర్వాత దాన్ని ఎవరు మార్చారో పరిశీలిస్తాం’ అని సీజేఐ వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరించుకుంది. సెప్టెంబర్ 26న ఈసీఈ విడుదల చేసిన ప్రకటనలో ‘సర్’కు సంబంధించిన ఫామ్-6 డిక్లరేషన్ ను సుప్రీంకోర్టు సమర్థించిందని పేర్కొన్నట్లు కోర్టు ముందుకు ప్రస్తావన వచ్చింది. అయితే ఫామ్-6 లో చేసిన మార్పులకు తాము ఆమోదం ఇవ్వలేదని సుప్రీంకోర్టు ఇప్పుడు స్పష్టం చేసింది.

**‘సీఈసీ అంటే కమిషన్ మొత్తం కాదు’**

పిటిషనర్ల వాదనలో రాజ్యాంగంలోని అధికరణ-324 ప్రధానాంశంగా నిలిచింది. ఎన్నికల పర్యవేక్షణ, దిశానిర్దేశం, నియంత్రణ అధికారాలను రాజ్యాంగం ఒక వ్యక్తిగా సీఈసీకు కాకుండా ఎన్నికల కమిషన్ అనే రాజ్యాంగ సంస్థకు అప్పగించిందని వారు వాదించారు. సీఈసీ కమిషన్‌కు ఛైర్మన్ మాత్రమేనని, కమిషన్‌కు చెందిన సమష్టి నిర్ణయాధికారాన్ని ఆయన వ్యక్తిగతంగా వినియోగించలేరని పిటిషనర్లు పేర్కొన్నారు. 2023 నాటి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ యాక్ట్ ప్రకారం కమిషన్ వ్యవహారాలు సాధ్యమైనంత వరకు ఏకాభిప్రాయంతో, అది సాధ్యం కాకపోతే మెజారిటీ నిర్ణయంతో జరగాలని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

**14 అభ్యంతరాలపై వివాదం**

2025 నవంబర్ నుంచి 2026 ఆగస్టు మధ్య సర్ కు సంబంధించిన కనీసం 14 సందర్భాల్లో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు నమోదు చేశారని పిటిషన్లు ఆరోపించాయి. కొన్ని నిర్ణయాలు తమకు తెలియకుండానే లేదా తమ సిఫారసు లేకుండానే తీసుకున్నట్లు వారు అభ్యంతరం తెలిపినట్టు పిటిషనర్లు మీడియా నివేదికలను ఆధారంగా చూపారు. ఈ ఆరోపణలు ఇప్పటివరకు కోర్టు నిర్ధారించిన వాస్తవాలు కావు. ఈసీఈ అధికారిక సమాధానం, సంబంధిత రికార్డులను పరిశీలించిన తర్వాతే వాటిపై కోర్టు నిర్ణయానికి రానుంది.

**చట్ట విరుద్ధమైతే జోక్యం చేసుకుంటాం**

ఎన్నికల కమిషన్ పేరిట తీసుకున్న నిర్ణయాలు ఏకాభిప్రాయంతో గానీ, మెజారిటీతో గానీ తీసుకోలేదని రికార్డుల్లో తేలితే ఆ నిర్ణయాలు ఎలా తీసుకున్నారో కమిషన్ వివరించాల్సి ఉంటుందని కోర్టు పేర్కొంది. చట్టపరమైన నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకున్నట్లు రికార్డుల్లో వెల్లడైతే వాటిని న్యాయపరంగా పరిశీలించవచ్చని ధర్మాసనం సంకేతమిచ్చింది. అయితే ముందుగానే సీఈసీపై చర్య తీసుకోవడం ఎన్నికల ప్రక్రియపైనా ప్రభావం చూపే అవకాశం ఉన్నందున తొందరపడి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి కోర్టు నిరాకరించింది.

**‘సర్’నే రద్దు చేయాలన్న పిటిషన్**

దేశవ్యాప్తంగా చేపట్టిన ‘సర్’తో పాటు దాని కింద తీసుకున్న చర్యలు, ఆదేశాలను చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించాలని ఒక పిటిషనర్ కోరగా ఆరోపణలపై రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో స్వతంత్ర న్యాయ విచారణ కమిషన్ లేదా ‘సిట్’ ఏర్పాటు చేయాలని మరో పిటిషనర్ కోరారు. ఈ అభ్యర్థనలపై కోర్టు ప్రస్తుతం తుది అభిప్రాయం వ్యక్తం చేయలేదు. అయితే మార్పులు చేసిన ఫామ్-6కు మా ఆమోదం లేదు అని ప్రధాన న్యాయమూర్తి స్పష్టంగా ప్రకటించడం ఈరోజు విచారణలో అత్యంత కీలక పరిణామం.

# నిత్యావసర ధరలపై నియంత్రణ ఏదీ?

**హైదరాబాద్, అక్టోబర్ 5 :**

నిత్యావసరాల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తుంటే ధరలకు అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉండటం దారుణమని బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే, అసెంబ్లీలో పార్టీ ఉప నాయకుడు టి.హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, పౌరసరఫరాల శాఖ పర్యవేక్షణ వైఫల్యానికి సామాన్య ప్రజలే మూల్యం చెల్లిస్తున్నారన్నారు. సన్న బియ్యం ధరలు నాలుగు నెలల్లోనే 25 శాతం పెరగడం ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రికార్డు స్థాయిలో పంట ఉత్పత్తి సాధించామని గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వం మరి ఉత్పత్తి పెరిగినప్పుడు ధరలు తగ్గాల్సింది పోయి బియ్యం ధరలు ఎందుకు ఆకాశాన్ని అంటుతున్నాయో చెప్పాలని నిలదీశారు. మీరు అమలు చేస్తున్న సన్న బియ్యం పథకం సఫలమైతే ఎందుకు బియ్యం ధరలు అదుపు తప్పుతున్నాయని ఆయన అడిగారు. మీరు ఇస్తున్న నాణ్యత లేని సన్న బియ్యాన్ని ప్రజలు వినియోగించడం లేదని చెప్పడానికి ఇది నిదర్శనం కాక మరేమిటని వ్యాఖ్యానించారు. ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతన్నకు ఎమ్మెస్పీ పేరిట దక్కుతున్నది నామమాత్రపు ధరేనని, కానీ దళారులకు దక్కుతున్నది క్వింటాకు రూ.8000పై మాటేనని తెలిపారు. రైతుకు గిట్టుబాటు ధర లేదు.. వినియోగదారుడికి అందుబాటు ధర లేదు.. లాభపడుతున్నది మాత్రం దళారులేనని అన్నారు. కళ్ళముందే ఈ తతంగం జరుగుతుంటే ప్రభుత్వంలో ఎందుకు చలనం లేదన్నారు. బియ్యం మాత్రమే కాదు.. ఉల్లి రూ.70, వెల్లుల్లి రూ.240, పల్లినూనె రూ.210, పెసరపప్పు రూ.125, కందిపప్పు రూ.165లకు అడ్డగోలుగా ధరలు పెరిగితే సామాన్య కుటుంబం ఎలా బతకాలన్నారు. వంటింటి బడ్జెట్ తారుమారవుతున్నా పౌరసరఫరాల శాఖ ఏం చేస్తోందని ప్రశ్నించారు. ధరల పర్యవేక్షణ గాలికి పోయిందని ఎద్దేవా చేశారు. ప్రజల జేబులు ఖాళీ అవుతుంటే ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషించడం కాదు.. వెంటనే చర్యలు తీసుకోవాలి అని హితవు పలికారు. బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత, అధిక మార్జిన్లపై తక్షణం నిఘాలు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్న బియ్యం సహా నిత్యావసరాల ధరలకు వెంటనే అడ్డుకట్ట వేసి సామాన్యుడిపై పడుతున్న భారం నుండి ఉపశమనం కల్పించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# ఏడాదిన్నరలోగా భూసర్వే పూర్తికి చర్యలు

**నిర్మల్/హైదరాబాద్, అక్టోబర్ 5 :**



రాష్ట్రంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి చేపట్టిన సర్వే కార్యక్రమాన్ని వచ్చే ఏడాదిన్నరలోగా ప్రతి గ్రామంలో పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. భూముల సమగ్ర సర్వేతో భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా చూడవచ్చని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై మంత్రి పొంగులేటి సోమవారం సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో రెవెన్యూ, అటవీ శాఖలకు సంబంధించిన సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో భూ సర్వేను దశలవారీగా నిర్వహించి ప్రతి భూ కమతానికి ల్యాండ్ పార్సెల్ మ్యాపింగ్ (ఎల్‌పీఎం) నంబర్ కేటాయించే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. భూ సంబంధిత సమగ్ర వివరాలను నమోదు చేసి భూ హక్కులకు భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల్లో నివసిస్తున్న సుమారు 72 వేల నుంచి 73 వేల మంది పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రణాళిక రూపొందించామని తెలిపారు. మొదటి దశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టగా రెండో దశలో మరో రెండు లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణానికి చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక స్తోమత లేని లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇప్పించి నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. అటవీ సంబంధిత సమస్యల కారణంగా ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోకుండా పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలన్నారు. అవసరమైతే ఈ అంశంపై రాష్ట్రస్థాయిలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. సమావేశంలో చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్‌కుమార్, రెవెన్యూ శాఖ (రిజిస్ట్రేషన్లు, స్టాంపులు) ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి. గౌతమ్, నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఐటీడీఏ పీవో మంద మకరందు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ, గృహ నిర్మాణ, అటవీ అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బకాయిల భారంతో ఖజానాపై ఒత్తిడి

మొదటిపేజీ తరువాయి

రిటైర్మెంట్ ప్రయోజనాలకు సంబంధించినవి రూ.8 వేల కోట్లుగా ఉన్నాయి. అనంతరం రూ.1,000 కోట్లు విడుదల చేసినట్లు సమాచారం.

డీఏ బకాయిలు కూడా ఉద్యోగులకు భారంగా మారాయి. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏ వాయిదాల్లో కనీసం మూడింటినైనా విడుదల చేయాలని ఉద్యోగ సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన బకాయిలను త్వరగా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయి.

భారీగా పెరుగుతున్న జీతాలు, పెన్షన్లు, రుణాలపై వడ్డీ చెల్లింపులు ఖజానాపై అదనపు ఒత్తిడిని పెంచుతున్నాయి. 202627 బడ్జెట్‌లో పెన్షన్ల కోసం రూ.14,737 కోట్లు, రుణాలపై వడ్డీల చెల్లింపులకు రూ.21,304 కోట్లు కేటాయించారు. మరోవైపు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమకూర్చాల్సి ఉండటంతో వ్యయాల మధ్య సమతుల్యత సాధించడం ప్రభుత్వానికి సవాలుగా మారింది.

పన్నుల ఆదాయం, కేంద్రం నుంచి వచ్చే నిధులు అంచనాలకు తగ్గడం, రుణాల అసలువడ్డీ చెల్లింపుల భారం పెరగడం పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తున్నాయి. పాత బకాయిలను దశలవారీగా చెల్లిస్తూనే కొత్త వ్యయాలను నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆదాయాన్ని పెంచుకోవడం, వ్యయాలకు ప్రాధాన్యత క్రమాన్ని నిర్ణయించడం, పెండింగ్ బిల్లులను క్రమబద్ధంగా పరిష్కరించడం ప్రభుత్వ ఆర్థిక నిర్వహణలో కీలకంగా మారింది.



# విద్యుత్ వినియోగదారులకు ట్రూఅప్ షాక్

మొదటిపేజీ తరువాయి

వ్యత్యాసాలకు సంబంధించిన ట్రూఅప్ ఛార్జీల వసూలుకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) అనుమతించింది. దీంతో రాష్ట్రంలోని రెండు విద్యుత్ పంపిణీ సంస్థలైన ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ పరిధిలో నవంబర్ నుంచి అదనపు ఛార్జీల వసూలు ప్రారంభం కానుంది. నవంబర్‌లో యూనిట్‌కు 30 పైసలు, డిసెంబర్ నుంచి యూనిట్‌కు 50 పైసల చొప్పున వసూలు చేయనున్నారు.

**రూ.5,420 కోట్ల భారం**

మొత్తం రూ.7,635.22 కోట్ల ట్రూఅప్ మొత్తంలో వ్యవసాయ రంగానికి సంబంధించిన రూ.2,214.99 కోట్లను ప్రభుత్వమే భరించాలని ఈఆర్సీ స్పష్టం చేసింది. ఇందులో ఎస్పీడీసీఎల్ పరిధికి రూ.1,442.49 కోట్లు, ఎన్పీడీసీఎల్ పరిధికి రూ.772.50 కోట్లు సబ్సిడీ రూపంలో ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన రూ.5,420.23 కోట్లను ఇతర అర్హత కలిగిన విద్యుత్ వినియోగదారుల నుంచి డిస్కంలు వసూలు చేయనున్నాయి. ఇందులో ఎస్పీడీసీఎల్ పరిధిలో రూ.4,222.93 కోట్లు, ఎన్పీడీసీఎల్ పరిధిలో రూ.1,197.30 కోట్లు ఉన్నాయి.

**రైతులకు మినహాయింపు**

వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకాన్ని కొనసాగిస్తూ రైతుల కనెక్షన్లకు ట్రూఅప్ ఛార్జీల నుంచి మినహాయింపు ఇచ్చారు. మిగిలిన వినియోగదారులపై పడే భారాన్ని విడతలవారీగా వసూలు చేయాలని ఈఆర్సీ నిర్ణయించింది. ఎస్పీడీసీఎల్ పరిధిలోని వినియోగదారులు 29 నెలల పాటు, ఎన్పీడీసీఎల్ పరిధిలోని వారు 26 నెలల పాటు ఈ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

**బిల్లుల్లో ప్రత్యేకంగా నమోదు**

వినియోగదారుల బిల్లుల్లో ట్రూఅప్ ఛార్జీలను ఇతర ఛార్జీలతో కలపకుండా ప్రత్యేకంగా ముద్రించాలని ఈఆర్సీ ఆదేశించింది. ఏ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొత్తాన్ని ఆ ఏడాది వివరాలతో విడిగా చూపాలని స్పష్టం చేసింది. ఇప్పటికే విద్యుత్ బిల్లుల భారం ఎదుర్కొంటున్న వినియోగదారులకు కొత్త ఛార్జీల వసూలు మరింత భారంగా మారనుంది.

# తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా అద్వైత్ కుమార్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 5 :**



తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అద్వైత్ కుమార్ సింగ్ సోమవారం స్వీకరించారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వంలో కో ఆర్డినేషన్ (కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు అండ్ కేంద్ర ప్రాయోజిత పథకాలు) ప్రత్యేక కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయనకు తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ పదవికి తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఆర్టీ నెం.1441, సాధారణ పరిపాలన శాఖ ఈనెల 3వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది.

# రెండు నెలల్లో సింగరేణి సమస్యలు పరిష్కరించాలి

**హైదరాబాద్, అక్టోబర్ 5 :**



రెండు నెలల్లోగా సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే హైదరాబాద్ లోని సింగరేణి భవన్ ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని తెలంగాణ రక్షణ సేన (టీఆరఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులను అన్‌ఫిట్ చేయడంతోపాటు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హెచ్ఎంఎస్, తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) నాయకులతో కలిసి సోమవారం లక్డీకాపూల్‌లోని సింగరేణి భవన్‌ను ముట్టడించారు. గంటకుపైగా రోడ్డుపై బైఠాయించారు. సింగరేణి యాజమాన్యం తమతో చర్చలు జరిపే వరకు అక్కడినుంచి కదిలేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ ఆందోళనతో సింగరేణి భవన్ ఎదుట పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. దీంతో సింగరేణి అధికారులు వచ్చి కవిత, హెచ్ఎంఎంఎస్ నాయకులతో చర్చలు జరిపారు. సింగరేణి సీ అండ్ ఎండీ సెక్రటేరియట్‌లో సమావేశంలో ఉన్నారని, ఆయన ఆదేశాల మేరకు తాము చర్చలకు వచ్చామని తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మెడికల్ బోర్డుకు అప్లయ్ చేసుకున్న వాళ్లందరినీ అన్‌ఫిట్ చేసి వాళ్ల వారసులకు ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. రెండు నెలల్లోగా ఈ ప్రక్రియ ప్రారంభం కావాలని, లేదంటే సింగరేణి భవన్ గేటు ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని ఆమె హెచ్చరించారు. కార్మికుల సంక్షేమాన్ని యాజమాన్యం పట్టించుకోవటం లేదని విమర్శించారు. మూడు నెలల క్రితం తాము ఒత్తిడి తెస్తేనే మెడికల్ బోర్డు పెట్టారని, కానీ దానికి దరఖాస్తు చేసుకున్న వారిలో 10 శాతం మందిని మాత్రమే అన్‌ఫిట్ చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత దరఖాస్తు చేసుకున్న వాళ్లందరినీ అన్‌ఫిట్ చేసి వాళ్ల వారసులకు ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. డిపెండెంట్ ఉద్యోగాలు మీరు వేసే బిచ్చం కాదు.. అది కార్మికుల హక్కు అని అన్నారు. సింగరేణి లాభాల్లో 35 శాతం కార్మికులకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలియాస్ పేర్లతో ఉద్యోగాలు చేస్తున్న వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా విజిలెన్స్ విచారణతో ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఇలా వేధింపులతో ఉద్యోగాల నుంచి తొలగించిన వాళ్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. తెలంగాణకు సింగరేణి ఆత్మవంటిదన్నారు. అలాంటి సింగరేణి కార్మికుల సంక్షేమానికి టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ పోరాటం చేస్తాయన్నారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం రూ.60 వేల కోట్లు బకాయిలు పెట్టడంతోనే సంస్థ ఇబ్బందుల్లో ఉందన్నారు. వెంటనే ఆ బకాయిలు చెల్లించి సంస్థను కాపాడాలని డిమాండ్ చేశారు.

**సింగరేణి ద్రోహుల చేతిలో ఉంది**

**– రియాజ్ అహ్మద్**

సింగరేణి సంస్థ ద్రోహుల చేతిలో బందీ అయ్యిందని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. స్వతంత్ర సంస్థగా ఉండాల్సిన సింగరేణిని మంత్రుల చేతిలో కీలుబొమ్మగా మార్చేశారన్నారు. ఇకనైనా యాజమాన్యం వైఖరిలో మార్పు రావాలని డిమాండ్ చేశారు. డిపెండెంట్ ఉద్యోగాలు సహా కార్మికుల సంక్షేమం కోసం పనిచేయాలని సూచించారు. కొత్త బొగ్గు బావులను ప్రైవేట్ సంస్థలకు కాకుండా సింగరేణి ద్వారా నిర్వహించాలని, నైనీ బ్లాక్‌లో కూడా సింగరేణి నుంచి కార్మికులను నియమించాలన్నారు.

# మెహదీపట్నంలో ఏసీబీ దాడి..

- రూ.4 లక్షల లంచం పట్టివేత
- రూ.8 లక్షలు డిమాండ్.. రూ.6.5 లక్షలకు ఒప్పందం
- తొలి విడతగా రూ.4 లక్షలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు
- సోదాల్లో మరో రూ.2.5 లక్షల లెక్కల్లో చూపని నగదు స్వాధీనం
- నిందితురాలిని ప్రత్యేక ఏసీబీ కోర్టుకు తరలింపు




**హైదరాబాద్, అక్టోబర్ 5:**

హైదరాబాద్ మెహదీపట్నంలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో లంచం తీసుకుంటున్న టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. గోల్కొండ జోన్ సర్కిల్33 (మెహదీపట్నం) కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న తులసిరామ్ సునీత ఓ భవన నిర్మాణానికి సంబంధించి రూ.4 లక్షల లంచం తీసుకుంటుండగా సిటీ రేంజ్ 1 ఏసీబీ అధికారులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. భవన నిర్మాణానికి సంబంధించి డిప్యూటీ కమిషనర్ జారీ చేసిన 'స్పీకింగ్ ఆర్డర్స్'ను పట్టించుకోకుండా నిర్మాణాన్ని కొనసాగించేందుకు అనుమతించడంతో పాటు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా ఉండేందుకు సునీత రూ.8 లక్షలు డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది. చివరకు రూ.6.5 లక్షలకు ఒప్పందం కుదిరింది. ఇందులో తొలి విడతగా రూ.4 లక్షలు కార్యాలయంలో స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిర్వహించిన సోదాల్లో లెక్కల్లో చూపని మరో రూ.2.5 లక్షల నగదును గుర్తించి సీజ్ చేశారు.

**అవినీతి నిరోధక చట్టం కింద కేసు**

అధికారిక విధులను దుర్వినియోగం చేసి అనుచిత లబ్ధి పొందేందుకు ప్రయత్నించిన ఆరోపణలపై సునీతపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదుదారుడి భద్రత, గోప్యత దృష్ట్యా ఆయన వివరాలను వెల్లడించలేదు. విచారణ అనంతరం నిందితురాలు సునీతను నాంపల్లిలోని ప్రత్యేక న్యాయమూర్తి (ఎస్పీఈ, ఏసీబీ) కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ప్రభుత్వ అధికారుల అవినీతికి సంబంధించి ఎవరైనా నిర్భయంగా ఏసీబీని సంప్రదించాలని అధికారులు సూచించారు.

# అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు

- దసరా కానుకగా మహిళలకు చీరల పంపిణీ
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



**ఖమ్మం, అక్టోబర్ 5:**

రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం, సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని ఎఫ్ సిఐ బైపాస్ రోడ్డు దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్ నుండి ఎంబి గార్డెన్స్ వరకు రూ. 180 లక్షల మునిసిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్, తెల్ల రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి ప్రభుత్వ పథకాలు ఖచ్చితంగా అందాలన్నారు. ఇళ్లు కేటాయించేటప్పుడు గుడిసెలలో నివసించే నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డివిజన్ లో ప్రజలకు అవసరమైన డ్రెయిన్లు, పార్కులు, రోడ్లు, మంచినీటి వసతి, విద్యుత్ లైన్ల వంటి మౌలిక వసతుల పనులను వెంటనే మంజూరు చేయించి వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. పేదరికం నుండి శాశ్వ త విముక్తి పొందేందుకు చదువు ఒక్కటే మార్గమని మంత్రి అన్నారు. ఖమ్మంలో ముఖ్యమంత్రి సహకారంతో మోడల్ స్కూళ్లు, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో పాటు కొత్తగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం రూ.1.25 లక్షలు వెచ్చించి ఉచితంగా ఇంగ్లీష్ మీడియం విద్య, వసతి, పుస్తకాలు, దుస్తులు అందిస్తోందన్నారు. నగరంలో కబ్జాలు, దౌర్జన్యాలు, పోలీస్ కేసుల ఇబ్బందులు లేకుండా ప్రజలందరూ సుఖసంతోషాలు, ప్రశాంతతతో జీవించాలన్నదే తమ ఆకాంక్ష అని మంత్రి స్పష్టం చేశారు. రాబోయే దసరా పండుగ సందర్భంగా మహిళలకు ముఖ్యమంత్రి కానుకగా చిలకపచ్చ చీరల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధికి ప్రజలందరూ బాధ్యతాయుతంగా తమ వంతు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ హస్మం తరావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ జయచందర్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మైనింగ్‌తో రామప్పకు ముప్పు అవాస్తవం

**సింగరేణి భవన్, అక్టోబరు 5 :**

ప్రపంచ వారసత్వ సంపద అయిన రామప్ప గుడికి సింగరేణి మైనింగ్‌తో ముప్పు పొంచి ఉందని వస్తున్న వార్తలు అపోహలు, అవాస్తవాలు మాత్రమే అని సింగరేణి యాజమాన్యం సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. సింగరేణి ఆధ్వర్యంలో ములుగు జిల్లా వెంకటాపూర్‌లో చేపట్ట తలపెట్టిన వెంకటాపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు విషయంలో సమగ్రంగా శాస్త్రీయ అధ్యయనం చేసిన తర్వాతే ముందుకు వెళ్లాలని నిర్ణయించామని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ విషయంలో భారత పురావస్తు శాఖ, ఇతర ప్రతిష్టాత్మక సంస్థలు శాస్త్రీయంగా అధ్యయనం చేసి ఇచ్చే నివేదికల ఆధారంగానే తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొంది. బాధ్యతాయుతమైన రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థగా ఉన్న సింగరేణి రాష్ట్రానికి చెందిన ప్రపంచ వారసత్వ సంపద అయిన రామప్ప గుడికి ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం చేకూర్చబోదని, వారసత్వ సంపద పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేసింది.

# కీలక ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి

**మొదటిపేజీ తరువాయి**

మంత్రి నితిన్ గడ్కరీతో కలిసి సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మొదటి రోజు సమావేశంలో పలు రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టుల్లో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం వంటి వివిధ అంశాలపై జరిగిన చర్చ అనంతరం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులు, కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులు, నిధుల మంజూరీలు, జాతీయ రహదారుల అభివృద్ధి అంశాలపై ఇరువురూ సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధి, సేతు బంధన్, సీఆర్‌యూఐఎఫ్ పనులకు కేంద్రం అందిస్తున్న సహకారానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణఏపీ రాష్ట్రాల మధ్య కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంతోపాటు హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేసేలా పలు కీలక ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందించాలని గడ్కరీని కోరారు.

**ఎల్‌బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్**

హైదరాబాద్ తూర్పు ప్రాంతంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు సుమారు 6 కి.మీ. మేర డబుల్ డెక్కర్ విధానంలో ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని మంత్రి కోరారు. ఇప్పటికే ఎన్‌హెచ్65లో ఎల్‌బీనగర్‌మల్కాపూర్ సెక్షన్‌ను సర్వీస్ రోడ్లు సహా ఆరు(6+2) లేన్లుగా అభివృద్ధి చేసేందుకు రూ.545 కోట్లతో కేంద్రం అనుమతులు ఇచ్చిందని తెలిపారు. ఎక్కువగా నిర్మాణాలు ఉన్న ప్రాంతాల్లో ఆరఈ వాల్‌కు బదులుగా వయాడక్ట్ విధానంలో నిర్మాణం చేపట్టాలని ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని తెలిపారు. మియాపూర్‌ఎల్‌బీనగర్ మెట్రో రైలు రెండో దశ కారిడార్‌ను హయత్‌నగర్ వరకు పొడిగించేందుకు రాష్ట్రం నిర్ణయించిన నేపథ్యంలో మెట్రోతో సమన్వయం ఉండేలా డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు 202627 వార్షిక ప్రణాళికలో చోటు కల్పించి మంజూరు చేయాలని కోరారు.

**పర్వతమాల కింద 5 రోప్‌వే ప్రాజెక్టులు**

పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ కల్పించేందుకు పర్వతమాల పథకం కింద రూ.1,230 కోట్ల అంచనాతో ఐదు రోప్‌వే ప్రాజెక్టులకు మంజూరు ఇవ్వాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, నల్గొండ హనుమాన్ హిల్, నాగార్జున సాగర్‌నాగార్జునకొండ, పెద్దపల్లి జిల్లా మంథని రామగిరి కోట, నిజామాబాద్ కిల్లా రామాలయం ప్రాంతాల్లో ఈ రోప్‌వేలను ప్రతిపాదించినట్లు తెలిపారు. ఇవి భక్తులు, పర్యాటకులు, స్థానిక ప్రయాణికులకు సౌకర్యం కల్పించడంతోపాటు పర్యావరణహిత రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడానికి దోహదపడతాయని వివరించారు.

**మూడు కీలక ఆర్వోబీ, ఆర్‌యూబీలకు మంజూరు**

202627కు సేతు బంధన్ పథకం కింద మూడు కీలక ఆర్వోబీ/ఆర్‌యూబీ ప్రాజెక్టులకు మంజూరు ఇవ్వాలని మంత్రి కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం బైపాస్ వద్ద నాలుగు లేన్ల ఆర్వోబీ, పెద్దపల్లి జిల్లాలో సుల్తానాబాద్ వద్ద రెండు లేన్ల ఆర్వోబీ, నల్గొండ జిల్లాలో పగిడిపల్లినడికుడి రైల్వే సెక్షన్‌లో నాలుగు లేన్ల ఆర్వోబీ నిర్మాణ ప్రతిపాదనలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

**ఎన్‌హెచ్-65 ఆరు లేన్ల విస్తరణకు వేగంగా ఆమోదాలు**

తెలంగాణఏపీ రాష్ట్రాలను కలిపే హైదరాబాద్‌విజయవాడమచిలీపట్నం ఎన్‌హెచ్ 65ను ఆరు(6G2) లేన్లుగా విస్తరించే ప్రాజెక్టును వేగవంతం చేయాలని మంత్రి కోమటిరెడ్డి గడ్కరీని కోరారు. ప్రస్తుతం ఈ రహదారిపై ట్రాఫిక్ 1.20 లక్షలకు పైగా పీసీయ□కు చేరిందని, అనేక ప్రమాదకర ప్రాంతాలు, బ్లాక్ స్పాట్లు ఉన్నాయని తెలిపారు. పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా రహదారిని విస్తరించడంతోపాటు రోడ్డు భద్రతను మెరుగుపరచడం అత్యవసరమని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు అలైన్‌మెంట్ ఆమోదం, పీఏటీఎస్‌సీ, పీపీపీఏసీ ఆమోదాలు ఇప్పటికే లభించాయని, సీసీఈఏ ఆమోదం కోసం సిఫారసు చేసిన నేపథ్యంలో త్వరగా తుది ఆమోదం లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఎన్‌హెచ్ 765పై ఎలివేటెడ్ కారిడార్**

హైదరాబాద్‌శ్రీశైలం ఎన్‌హెచ్ 765లో టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్‌కు మంజూరు ఇవ్వాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. అటవీ ప్రాంతంలో రహదారి విస్తరణకు ఎదురవుతున్న సమస్యలకు ఎలివేటెడ్ కారిడార్ పరిష్కారంగా నిలుస్తుందని, శ్రీశైలం వెళ్లే భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించడంతోపాటు నల్లమల అటవీ ప్రాంత పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఇది దోహదపడుతుందని వివరించారు.

**33 పనులకు రూ.1,227.75 కోట్ల మంజూరు కోరిన మంత్రి**

202627 ఆర్థిక సంవత్సరానికి సీఆర్‌ఐఎఫ్ పథకం కింద రాష్ట్రంలో 33 రహదారి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోమటిరెడ్డి కోరారు. మొత్తం 511.68 కి.మీ పొడవుతో చేపట్టనున్న ఈ పనులకు రూ.1,227.75 కోట్ల అంచనా వ్యయం అవుతుందని తెలిపారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన ఈ పనులు రాష్ట్రవ్యాప్తంగా సమతుల్య ప్రాంతీయ అభివృద్ధికి ఎంతో కీలకమని, వీటిని పరిశీలించి 202627 సీఆర్‌ఐఎఫ్ పథకం కింద మంజూరు చేయాలని గడ్కరీని కోరారు.

**ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగానికి ఆర్థిక, కేబినెట్ ఆమోదం తెలపాలి**

హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్) లోని ఉత్తర భాగానికి ఆర్థిక, కేంద్ర మంత్రివర్గ ఆమోదం త్వరగా ఇవ్వాలని కోమటిరెడ్డి కోరారు. సంగారెడ్డినర్సాపూర్‌తూప్రాన్‌గజ్వేల్‌జగదేవ్‌పూర్‌భువనగిరిచౌటుప్పల్ మార్గంలో 161.518 కి.మీ మేర నిర్మించనున్న ఆరఆరఆర్ ఉత్తర భాగానికి భూసేకరణ వ్యయంలో 50 శాతం రాష్ట్రం భరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఇప్పటికే 90 శాతానికి పైగా భూములకు అవార్డులు ఆమోదమయ్యాయని, ఎన్‌హెచ్ఏఐ టెండర్లు కూడా ఆహ్వానించినందున వీలైనంత త్వరగా ఆర్థిక, కేబినెట్ ఆమోదాలు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ చుట్టూ పూర్తి రింగ్‌ను ఏర్పాటు చేసేందుకు ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగాన్ని కూడా ఉత్తర భాగంతో సమానంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ, పారిశ్రామిక పార్కులు, రేడియల్ రోడ్లు తదితర భవిష్యత్ మౌలిక వసతులకు దక్షిణ ఆర్‌ఆర్‌ఆర్ కీలకంగా మారుతుందని వివరించారు.

**హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే**

తెలంగాణ, ఏపీల మధ్య భవిష్యత్ కనెక్టివిటీని మరింత బలోపేతం చేసే హైదరాబాద్‌అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు సంబంధించి డీపీఆర్ ప్రక్రియను వేగవంతం చేసి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని మంత్రి కోరారు. దీన్ని తెలంగాణలోని డ్రైపోర్టుతో అనుసంధానం చేయడం ద్వారా సరకు రవాణా సులభతరం అవుతుందని, ఆర్థిక కార్యకలాపాలు, పారిశ్రామిక అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. బందర్ పోర్టుకు స్పర్ కనెక్టివిటీ కల్పించే అవకాశం కూడా ఉందని వివరించారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన ఈ ప్రాజెక్టులన్నింటినీ సానుకూలంగా పరిశీలించి అవసరమైన అనుమతులు, నిధుల మంజూరు, కేబినెట్ ఆమోదాలను త్వరితగతిన పూర్తి చేసి సహకరించాలని మంత్రి కోమటిరెడ్డి కేంద్ర మంత్రిని కోరారు. మంత్రి వెంట ఆర్ అండ్ బి స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, చీఫ్ ఇంజనీర్లు బి.వి. రావు, ధర్మారెడ్డి, వసంత్ నాయక్, పలువురు అధికారులు ఉన్నారు.

# స్వల్పకాలిక పంటల సాగును ప్రోత్సహించాలి

- రబీ కార్యాచరణపై వ్యవసాయ కమిషనర్ వీసీ

**హైదరాబాద్, అక్టోబర్ 5 :**



ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా వరికి ప్రత్యామ్నాయంగా, తక్కువ నీటితో సాగయ్యే స్వల్పకాలిక పప్పుధాన్యాలు, నూనె గింజల పంటలతోపాటు అధిక ఆదాయాన్నిచ్చే కూరగాయల పంటల సాగు జరిగేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్ అధికారులను ఆదేశించారు. రబీ(యాసంగి) 202627 కార్యాచరణ ప్రణాళికపై సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉన్న నీటి వనరులు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించి, పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో జిల్లాల వారీగా యాసంగి సీజన్‌కు సంబంధించిన సమీక్షా సమావేశాలు నిర్వహించాలని అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయి నుంచి సేకరించిన అంశాలను క్రోడీకరించి రబీ కార్యాచరణ□ను రూపొందించి ప్రభుత్వానికి నివేదించనున్నారు. క్షేత్రస్థాయి అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు తక్కువ నీటితో పండే పంటల ఎంపిక, అనువైన విత్తన రకాలు, పంట యాజమాన్య పద్ధతులపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సందేహాలను నివృత్తి చేయాలని కోరారు. కాగా, వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయంలో ఎరువుల కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. యాసంగి సీజన్‌కు సరిపడ ఎరువుల సరఫరా, ప్రస్తుత నిల్వల స్థితిగతులపై సమీక్షించి రాబోయే సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ సంచాలకుడు డాక్టర్ బి.గోపి, ఉద్యాన శాఖ సంచాలకురాలు డాక్టర్ యాస్మిన్ బాషా పాల్గొన్నారు. వీరితోపాటు వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, ఇక్రిశాట్, కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ(క్రిడా), భారత వాతావరణ శాఖ, భారతీయ వరి పరిశోధనా సంస్థ (ఐఐఆర్ఆర్), భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ(ఐఐఎంఆర్), భారతీయ నూనె గింజల పరిశోధనా సంస్థ(ఐఐఓఆర్), ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయాల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



# 21న పోలీసు అమరుల సంస్మరణ సభ

- గోషామహల్ పోలీస్ స్టేడియాన్ని పరిశీలించిన డిజిపి
- సభా వేదిక, రాకపోకలు, పార్కింగ్ పై సమీక్ష

**హైదరాబాద్**

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని డిజిపి సి.వి.ఆనంద్ అధికారులను ఆదేశించారు. అక్టోబరు 21న గోషామహల్ పోలీస్ స్టేడియంలో నిర్వహించనున్న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి సంబంధించి సోమవారం స్టేడియాన్ని పరిశీలించిన ఆయన ఏర్పాట్లపై సమీక్షించారు. సభావేదిక నిర్మాణం, ప్రముఖుల రాకపోకలు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలను పరిశీలించారు.

**నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి**

స్టేడియంలో కొనసాగుతున్న వివిధ నిర్మాణ పనుల పురోగతిని డిజిపి సమీక్షించారు. 48 గుర్రాలకు వసతి కల్పించే ఆధునిక అశ్వశాల సముదాయం, పోలీసు జాగిలాల కెన్నెల్స్, ఐదు అంతస్థుల సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ (సీఏఆర్) భవనం, క్రీడా మైదానాలు, అథ్లెటిక్స్ సదుపాయాల నిర్మాణాలను పరిశీలించారు. పనుల్లో జాప్యం చేయొద్దన్నారు. అధికారులు, ఇంజినీర్లు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని కోరారు.




# గురుకులంలో ఎలుకల కలకలం

**గూడూరు, అక్టోబర్ 5:**

గూడూరు సమీపంలోని మహాత్మా జ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాలలో మరోసారి ఎలుకలు కలకలం సృష్టించాయి. మరో విద్యార్థినిని ఎలుకలు కొరికి గాయం చేయడంతో మిగతా విద్యార్థులు, సిబ్బంది ఆందోళన చెందారు. పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థిని రాత్రి నిద్రిస్తున్న సమయంలో ఎలుకలు కొరకడంతో కాలు కింది భాగంలోని గాయమైంది. విషయం తెలుసుకున్న తహసిల్దార్ నాగభవాని పాఠశాలకు చేరుకొని విద్యార్థినితో మాట్లాడి ఆరా తీశారు. వెంటనే ఆమెను వైద్య పరీక్షల కోసం హాస్పిటల్ కు తరలించారు. నెల రోజుల క్రితం ఇదే పాఠశాలలో మరో విద్యార్థినిపై ఎలుకలు దాడి చేసినట్లు విద్యార్థులు ఈ సందర్భంగా తహసిల్దార్ దృష్టికి తీసుకువచ్చారు.



# రక్షకులే రాక్షసులుగా మారుతున్నారు

- మహిళలపై దాడులపై రాహుల్ తీవ్ర ఆగ్రహం
- ప్రశ్నించే మహిళలకు అమిత్ షా ఎందుకు భయపడుతున్నారు?

**న్యూఢిల్లీ, అక్టోబర్ 5:**

రక్షకులే రాక్షసుల్లా మహిళలపై అరాచకాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. ప్రశ్నించే మహి ళలను చూసి కేంద్ర హోంమంత్రి అమిత్ ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. మహిళలను అణచివేసే ధోరణి ఢిల్లీలో స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. ఢిల్లీ పోలీసులు ఇటీవల మహిళలపై దాడులు, దురుసు ప్రవర్తనకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో రాహుల్ తీవ్ర విమర్శలు చేశారు. బాధితులకు న్యాయం చేయాలని రాహుల్గాంధీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇటీవల జర్నలిస్టులు షహీన్ ఖాన్, నఫీసా ఖాన్లతో జరిపిన సంభాషణకు సంబంధిం చిన వీడియోను ఆయన 'ఎక్స్' వేదికగా పంచు కున్నారు. పోలీసులు దురుసుగా ప్రవర్తించా రని జర్నలిస్టులు తనతో చెప్పి ఆవేదన వ్యక్తం చేశారని రాహుల్ తెలిపారు. కెమెరాలు లాక్కొవడంతోపాటు వారిని ఈడ్చుకెళ్లడం ఏంటని ప్రశ్నించారు. వారి ఫిర్యాదుపై కనీసం ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని పేర్కొన్నారు.

**మహిళలు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే..**

పోలీసే స్టేషన్లోనే ఇలాంటి ఘటనలు జరగడం దారుణమని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. రక్షించాల్సిన వారే వారికి ప్రమాదంగా మారుతున్నారని ఆరోపిం చారు. సాకేత్ పోలీస్ స్టేషన్లోని సీసీటీవీ దృశ్యాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన పోలీసు అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కాగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఇటీవల పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి.



# అమెరికా వర్క్ వీసాలపై వచ్చే వారంలో కీలక నిర్ణయం..?

**అంతర్జాతీయ బ్యూరో:**

విదేశీ వర్క్ వీసాలపై అమెరికా యంత్రాంగం కఠిన ఆంక్షలకు సిద్ధమవుతోంది. యూఎస్ కార్మిక శాఖ ఇన్స్పెక్టర్ జనరల్ ఆంథోనీ డిఎస్పోసిటో ఎక్స్ వేదికగా చేసిన పోస్ట్ ఈ దిశగా సంకేతాలు ఇచ్చింది. ''విదేశీ వర్క్ వీసాల విషయంలో వచ్చే వారం కీలకం కానుంది. అమెరికా ఉద్యోగాలు.. అమెరికా కార్మికులకే'' అనే అర్థంలో ఆంథోనీ పోస్టు పెట్టారు. అయితే.. ఏ వీసా కార్యక్రమం గురించి ఈ వ్యాఖ్యలు చేశారో ఆయన స్పష్టత ఇవ్వలేదు. అమెరికన్ ఉద్యోగులకు నష్టం కలిగించే విధంగా కంపెనీలు విదేశీ కార్మికుల వీసాలను దుర్వినియోగం చేస్తున్నాయని కొంతకాలంగా ట్రంప్ సర్కార్లోని పలువురు నేతలు వ్యాఖ్యలు చేస్తోన్న సంగతి తెలిసిందే. హెచ్1బీ వీసా వ్యవస్థ పూర్తిగా విఫలమైందని ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ రెండురోజుల క్రితం వ్యాఖ్యలు చేశారు. అమెరికన్ ఉద్యోగుల స్థానంలో తక్కువ జీతాలకే విదేశీ కార్మికులను తెచ్చుకోవడానికి కంపెనీలు ఈ ప్రోగ్రామ్ను దుర్వినియోగం చేస్తున్నాయన్నారు.హెచ్1బీ వీసా దరఖాస్తులపై లక్ష డాలర్ల ఫీజును వసూలు చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ వసూలు విషయంలో చట్టపరమైన చిక్కులు ఉన్నాయి. అధిక వేతనాలు పొందే ఉద్యోగాలకు హెచ్1బీ ఎంపికలో ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు కంపెనీలు అమెరికన్ ఉద్యోగులను తొలగించి విదేశీ ఉద్యోగులను తీసుకుంటున్నాయా..? అనేదానిపై ట్రంప్ సర్కార్ నిఘా పెట్టింది. ఈ నేపథ్యంలో.. వచ్చే వారం ఎలాంటి నిర్ణయం ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.



# ప్రభుత్వంతో చర్చలు విఫలం.. ఇమ్రాన్ మద్దతుదారుల ర్యాలీ

**నేషనల్ బ్యూరో (మనసులో మాట):**

పాకిస్తాన్ నిత్యం ఏదో ఒక రాజకీయ ఘర్షణతోనే ఉంటుంది. తాజాగా పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారులు, ఆయన పార్టీ పీటీఐ (పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్) నేతలు ఆందోళన బాటపట్టారు. ప్రభుత్వంతో వారు జరిపిన చర్చలు విఫలం కావడంతో ఇస్లామాబాద్ వరకు లాంగ్ మార్చ్ నిర్వహించాలని పీటీఐ నేతలు నిర్ణయించారు. దీంతో ఆదివారం అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాలివి. పాక్ ప్రభుత్వానికి, పీటీఐ మద్దతుదారులకు మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది.వారి మధ్య గతంలో చర్చలు జరిగాయి. అనంతరం రెండో దశ చర్చలు అక్టోబర్ 3, శనివారం సాయంత్రం జరిగాయి. పీటీఐ ప్రతినిధులు, పాక్ ప్రభుత్వం మధ్య శనివారం సాయంత్రం ఐదు గంటలకు చర్చలు ప్రారంభంకగా.. ఆదివారం వేకువఝాము వరకు కొనసాగాయి. ఈ చర్చలు విఫలం కావడంతో ముందుగా ప్రకటించినట్లుగానే ఆదివారం తమ పార్టీ ఆధ్వర్యంలో లాంగ్ మార్చ్ జరుగుతుందని పార్టీ ప్రకటించింది. నిజానికి సెప్టెంబర్ 27నే లాంగ్ మార్చ్కు ప్లాన్ చేశారు. అయితే, ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు అక్టోబర్ 4కు వాయిదా వేశారు.శనివారం చర్చలు విఫలం కావడంతో ఈరోజు ఇస్లామాబాద్లో మార్చ్ నిర్వహించారు. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్య ప్రస్తుతం అక్కడి జైలులో శిక్ష అనుభవిస్తున్న సంగతి తెలిసిందే. జైలులో ఉన్న ఇమ్రాన్ ఖాన్కు ప్రభుత్వం సరైన వైద్యం కూడా అందించడం లేదు. దీంతో పీటీఐ నిరసన చేపట్టింది. తాజాగా ప్రభుత్వంతో పీటీఐ జరిపిన చర్చల్లో ఇదే కీలకాంశం. తమకు ఇమ్రాన్ఖాన్ను జైలులో కలుసుకునే అవకాశం ఇవ్వాలని పీటీఐ నేతలు కోరారు. అలాగే, ఆయనకు తక్షణమే మెరుగైన వైద్యం అందించేలా చూడాలని డిమాండ్ చేశారు.అది కూడా.. ఇమ్రాన్ వ్యక్తిగత వైద్యులు ఆయనను పరీక్షిస్తారని సూచించారు. అలాగే, జైలులో ఉన్న ఖాన్ సోదరిని విడుదల చేయాలని కూడా వారు డిమాండ్ చేశారు. ఇమ్రాన్ భార్య బుష్రా బీబికి కూడా వైద్యం అందించాలని కోరారు. ఇలాంటి అనేక డిమాండ్లకు పాక్ ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాలేదు. దీంతో ర్యాలీకి పీటీఐ పిలుపునిచ్చింది. ఆదివారం మధ్యాహ్నం 1.00 గంటలకు గాంధీ చౌక్కు తరలిరావాలని పిలుపునిచ్చింది. అయితే, ఇస్లామాబాద్లో ఆందోళనల్ని ప్రభుత్వం అడ్డుకుంటోంది.



# యెమెన్లో పోరు ఉద్ధృతం.. కీలక పట్టణం హూతీల చేతుల్లోకి!



**అంతర్జాతీయ బ్యూరో**

యెమెన్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్ మద్దతు కలిగిన హూతీ తిరుగుబాటుదారులు దేశంలో మరింత భూభాగాన్ని ఆక్రమించుకున్నారు. కీలకమైన తుర్బా పట్టణాన్ని తమ నియంత్రణలోకి తెచ్చుకున్నారు. హూతీలపై స్థానిక ప్రభుత్వం (పీఎల్సీ) భారీ సైనిక చర్యను ప్రకటించడానికి కొద్దిసేపటి ముందే ఈ పరిణామం చోటుచేసుకుంది. మరోవైపు యెమెన్ ప్రభుత్వానికి మద్దతుగా ఉన్న సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు.. హూతీలపై విరుచుకుపడుతున్నాయి.కొన్ని రోజులుగా హూతీలు దేశంలోని మూడో అతిపెద్ద నగరమైన తైజ్లోకి చొచ్చుకెళ్లేందుకు చూస్తున్నారు. యెమెన్ సర్కారుకు కేంద్రంగా ఉన్న ఏడెన్ను, తైజ్ను కలిపే ప్రధాన రహదారిపై తుర్బా పట్టణం ఉంది. హూతీల నుంచి తైజ్ను రక్షించే ప్రభుత్వ బలగాలకు ఇది కీలక స్థావరంగా ఉంటూ వచ్చింది. అంతకుముందు హూతీలు తైజ్ శివార్లలోని అనేక ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నారు. గత నెలలో మోఖా రేవు పట్టణం, బాబ్ ఎల్ మండెబ్ జలసంధిపై వారు నియంత్రణ సాధించిన విషయం తెలిసిందే.హూతీల నియంత్రణలో ఉన్న భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా యెమెన్ ప్రభుత్వం 'డాన్ ఆఫ్ యెమెన్' పేరిట ఆదివారం భారీ సైనిక చర్యను ప్రకటించింది. ఈ క్రమంలోనే బాబ్ ఎల్ మండెబ్ జలసంధిని తమ నియంత్రణలోకి తీసుకోవడంలో పైచేయి సాధించామని తాజాగా ప్రకటించింది. ధుబాబ్ అనే తీరప్రాంత పట్టణంతోపాటు, దాని సమీపంలోని విమానాశ్రయాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది.

# విమాన సర్టిఫికేషన్కు లంచం.. డీజీసీఏ అధికారి, డైరెక్టర్ అరెస్ట్




**చెన్నై**

విమానం ఎయిర్వర్తినెస్ సర్టిఫికేషన్ కోసం, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అధికారి లంచం డిమాండ్ చేశారు. ఒక విమానయాన సంస్థ డైరెక్టర్ నుంచి రూ.2.5 లక్షలు తీసుకున్నారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) దృష్టికి ఇది వెళ్లింది. ఈ నేపపథ్యంలో డీజీసీఏ అధికారితో పాటు విమానయాన సంస్థ డైరెక్టర్ను అరెస్ట్ చేసింది. తమిళనాడు రాజధాని చెన్నైలో ఈ సంఘటన జరిగింది. ఏక్వి ఎయిర్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ప్రైవేట్ లిమిటెడ్కు చెందిన ఒక ట్రైనింగ్ ఫ్లైట్కు ఎయిర్వర్తినెస్ సర్టిఫికేషన్ సంబంధించి చెన్నై డీజీసీఏ డిప్యూటీ డైరెక్టర్ (ఎయిర్వర్తినెస్) సుశీల్ కుమార్ గార్గ్ లంచం డిమాండ్ చేశారు. , ఆ విమానయాన సంస్థ డైరెక్టర్ సచిన్ కేశవ్ భానే నుంచి డీజీసీఏ అధికారి సుశీల్ కుమార్ గార్గ్ రూ.2.5 లక్షలు లంచం తీసుకుంటుండగా సీబీఐ అధికారులు రెడ్హ్యాండెడ్గా పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో వారిద్దరిని అరెస్ట్ చేశారు. విమానాల ఎయిర్వర్తినెస్ సర్టిఫికేషన్లో అనుచిత సహాయం అందించినందుకు ప్రతిఫలం ఆశించడం, చట్టవిరుద్ధంగా లంచం డిమాండ్ చేసి స్వీకరించడం వంటి ఆరోపణలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# రెండు పడవలు ఢీకొని 30 మందికి పైగా మృతి

- డజన్ల కొద్దీ గల్లంతు
- కాంగో నదిలో ఘోర ప్రమాదం

**కిన్షా సా, అక్టోబర్ 5 :**

కాంగో నదిలో రెండు పడవలు ఢీకొన్న ఘటనలో 30 మందికిపైగా మృతిచెందగా, డజన్లకొద్దీ గల్లంతయ్యారని కాంగో అధికారులు సోమవారం తెలిపారు. ప్రావిన్షియల్ అంతర్గత వ్యవహారాల మంత్రి క్రిస్పిన్ మ్బుటు ప్రకారం ఈక్వేటర్ ప్రావిన్స్లోని న్గొంబేలుకోలెలా ప్రాంతం సమీపంలో ఆదివారం సాయంత్రం మోటారుతో నడిచే చెక్క పడవలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ప్రమాదానికి గల కారణం తెలియరాలేదు. ప్రమాదంలో మరణించిన వారికి ఇప్పటికే అంత్యక్రియలు జరిపినట్లు మంత్రి అసోసియేటెడ్ ప్రెస్కు తెలిపారు. ఒక పడవ వాయువ్య దిశలో ఉన్న ఉబాంగి నుండి రాజధాని కిన్షాసాకు ప్రయాణిస్తుండగా మరొకటి కిన్షాసా నుండి ప్రమాదం జరిగిన ప్రదేశానికి సమీపంలో ఉన్న లుకోలెలాకు వెళుతోందని మ్బుటు చెప్పారు. ఇంకా బాధితులు, ప్రాణాలతో బయటపడిన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. నది ఒడ్డు నుండి ప్రమాదాన్ని చూశానని చెప్పిన భద్రతా దళాల సభ్యుడు ఒకరు ఏపీతో మాట్లాడుతూ 'ఉబాంగి నుండి తిరిగి వస్తున్న పడవ సరుకులతో నిండిపోయి కిన్షాసా నుండి వస్తున్న పడవను ఢీకొట్టింది' అని తెలిపారు. పడవలోని ప్రయాణికులలో దాదాపు అందరూ నీటిలో చిక్కుకుపోయారు.. పడవ కూడా మునిగిపోయింది' అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఆయన తెలిపారు. మధ్య ఆఫ్రికా దేశమైన ఈ దేశంలో ఘోరమైన పడవ ప్రమాదాలు సర్వసాధారణం. రాత్రిపూట ప్రయాణాలు, రద్దీగా ఉండే పడవలే వీటికి కారణమని తరచుగా ఆరోపిస్తుంటారు. దేశంలోని మారుమూల ప్రాంతాల్లో పేలవమైన భద్రతా ప్రమాణాలు, మౌలిక సదుపాయాల కొరత కూడా ఇటీవలి సంవత్సరాల్లో పడవ ప్రమాదాల్లో వందలాదిమంది మరణించడానికి కారణమవుతున్నాయి. జూలైలో రాష్ట్ర పరీక్షల నుండి విద్యార్థులను తిరిగి తీసుకు వస్తున్న ఒక చెక్క పడవ మధ్య భారతదేశంలో మునిగిపోయి కనీసం 20 మంది మరణించారు. ఆ నౌక కసాయ్ ప్రావిన్స్లో ప్రయాణిస్తుండగా సంకురు, కసాయ్ నదుల సంగమ ప్రాంతంలోకి ప్రవేశించే సమయంలో మునిగిపోయింది. గతంలో రాత్రిపూట పడవ ప్రయాణాల వల్ల అనేక ప్రమాదాలు జరిగాయని మంత్రి క్రిస్పిన్ మ్బుటు తెలిపారు.

# భారత్ ఎటునుంచైనా దాడి చేయగలదు

**భారత్ :**

భారతదేశ అణు సామర్థ్యం, రక్షణ శక్తిపై అంతర్జాతీయంగా మరో కీలక నివేదిక వెలువడింది. భారత్వద్ద ప్రస్తుతం 190 అణ్వాయుధాలున్నాయని, శత్రు దేశాల గుండెల్లో నిద్రపోయేలా సుదూర లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించగల అధునాతన క్షిపణి వ్యవస్థలను నిరంతరం ఆధునికీకరిస్తోందని ప్రముఖ అంతర్జాతీయ సంస్థ బులెటిన్ ఆఫ్ ద అటామిక్ సైంటిస్ట్స్ వెల్లడించింది. ముందుగా అణు దాడి చేయం అనే సూత్రానికి కట్టుబడి ఉంటూనే శత్రువులు దాడికి పాల్పడితే కోలుకోలేని దెబ్బతీసే రీతిలో భూమి, ఆకాశం, సముద్ర మార్గాల్లో న్యూక్లియర్ ట్రయాడ్ను భారత్ సిద్ధంగా ఉంచుకుంది. భారత్ తన వద్ద ఉన్న అణ్వాయుధ సంపత్తిని, క్షిపణి పరిధిని అధికారికంగా ఎప్పుడూ బహిర్గతం చేయదు. అయినప్పటికీ భారత్ వద్ద దాదాపు 190 అణ్వాయుధాలు ఉండే అవకాశం ఉందని అంతర్జాతీయ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఇతర దేశాల సహాయం లేకుండా స్వదేశీ సాంకేతికతతో డీఆర్డీవో అభివృద్ధి చేసిన క్షిపణులు భారత్కు బలమైన రక్షణ కవచంగా మారాయని పేర్కొంటున్నారు.



# ఉగ్రదాడి భయంతో

## ఫెయిర్ఫోర్డ్ వీడిన బీ1 బాంబర్లు



**అంతర్జాతీయ బ్యూరో:**

బ్రిటన్లోని రాయల్ ఎయిర్ఫోర్స్ స్థావరం పై వారం క్రితం ఉగ్రదాడి కుట్రను గుర్తించి పోలీసులు అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఇరాన్పై అమెరికా వైమానిక దాడులకు లాంచ్ ప్యాడ్లా పని చేస్తోన్న ఆ స్థావరంపై మళ్లీ దాడులు జరుగుతాయనే భయంతో అమెరికా అప్రమత్తమైంది. ఫెయిర్ఫోర్డ్లోని రాయల్ ఎయిర్ ఫోర్స్ స్థావరం నుంచి తమ బీ1 బాంబర్లను తిరిగి యూఎస్లోని స్థావరాలకు తరలించింది. ఈ విషయాన్ని అమెరికా అధికారులు ధ్రువీకరించారు. అయితే ఉగ్రదాడి భయంతో వాటిని తరలించారా..? అన్న ప్రశ్నకు సమాధానం ఇవ్వలేదు. సాధారణంగా బాంబర్లకు ఏదైనా ముప్పు పొంచి ఉందని భావిస్తే.. వాటిని యూకేలోని మరో ప్రాంతానికి తరలిస్తారని నిపుణులు పేర్కొన్నారు. అలా కాకుండా ఏకంగా అమెరికాకు తరలించడం అసాధారణమన్నారు.

# మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ పోస్టులు విడుదల

**కూకట్‌పల్లి నియోజకవర్గ ఎస్సీ డిపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్‌గా మట్టే ప్రసన్న కుమార్ నియామకం**



**కూకట్‌పల్లి, రాజముద్ర న్యూస్:** మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన నూతన పోస్టులు విడుదలైన సందర్భంగా, కూకట్‌పల్లి నియోజకవర్గ ఎస్సీ డిపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్‌గా మట్టే ప్రసన్న కుమార్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం శ్రీ హేమదుర్గా భవన్‌లో నియామక పత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ నూతనంగా నియమితులైన మట్టే ప్రసన్న కుమార్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ఎస్సీ వర్గాల హక్కులు మరియు సంక్షేమం కోసం కృషి చేస్తూ పార్టీకి మరింత సేవలందించాలని బండి రమేష్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీ డిపార్ట్‌మెంట్ నాయకులు, కార్యకర్తలు, మహిళ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

# ఐకేపీ కేంద్రం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వినతి



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** తుంగతుర్తి నియోజకవర్గం లోని గానుగబండ గ్రామానికి చెందిన మహిళా సంఘాల సభ్యులు తమ గ్రామానికి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కేటాయించాలని కోరుతూ సూర్యాపేట జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.గతంలో ఐకేపీ కేంద్రానికి సంబంధించిన కొన్ని లావాదేవీల విషయంలో వివాదాలు చోటుచేసుకున్నాయని, ప్రస్తుతం కొంతమంది రాజకీయపరంగా తమను ఇబ్బందులకు గురిచేస్తూ కేంద్రం నిర్వహణకు అడ్డంకులు కల్పిస్తున్నారని మహిళలు సూర్యాపేట జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే గతంలో ఐకేపీ కేంద్రం వద్ద జరిగిన వ్యవహారాలపై కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించి,సమగ్రంగా విచారణ జరిపించాలని,అవసరమైతే సిబిఐ విచారణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల సభ్యులు కోరారు రైతులు,మహిళా సంఘాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని గానుగబండలో ఐకేపీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో గీతాంజలి విద్యార్థుల జైత్రయాత్ర

**ఖో-ఖో, క్రికెట్ లో తెలంగాణకు ప్రథమ స్థానం**

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్** :వై ఎస్ డి ఏ ఆధ్వర్యంలో జరిగిన 2026 ఆల్ ఇండియా స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో గీతాంజలి ది గ్లోబల్ స్కూల్, కొండాపూర్ విద్యార్థులు అద్భుత ప్రతిభ చాటారు. జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ జట్లు ఖో–ఖో, క్రికెట్‌లో ప్రథమ స్థానం, బ్యాడ్మింటన్‌లో ద్వితీయ స్థానం సాధించాయి. ఈ విజయంలో గీతాంజలి స్కూల్ విద్యార్థులు జగదీశ్వర్, హేమంత్, జతిన్, రిత్విక్, శౌర్య, సాత్విక్, అనిరుధ్, రుషికేష్, అక్షర, అరుషి, యోకల్య కీలక పాత్ర పోషించారు. విద్యార్థులను కోచ్‌లు మురళి, శ్రీనివాస్ శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయికి తీర్చిద్దారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు, కోచ్‌లను అభినందించారు. 2026 సంవత్సరంలో పాఠశాల క్రీడా రంగంలో ఇది మరో మైలురాయిగా నిలిచింది.




# ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి...

- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి
- మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మడపతి చంద్రమౌళి



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద అక్టోబర్ 6న నిర్వహించనున్న అఖిల పక్షం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శంకర్ పల్లి మండల, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి, మడపతి చంద్రమౌళి పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష ధోరణికి నిరసనగా, ఎస్ఆర్ఐ ప్రక్రియలో జరిగిన అక్రమాలపై ఏఐసీసీ, ఇండియా కూటమి పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 6, మంగళవారం ఉదయం 10 గంటలకు కొంగర కలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ నిరసన మార్చ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటర్ల హక్కుల పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి శంకర్ పల్లి మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచ్ లు, వార్డు మెంబర్లు, మాజీ ఎంపీటీసీ లు, మాజీ సర్పంచ్ లు, మాజీ వార్డు మెంబర్లు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్యు ఐ సేవాదళ్ తదితర అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బొల్లారం వెంకట్ రెడ్డి, చంద్రమౌళి కోరారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ఈ నిరసన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ప్రజావాణి కార్యక్రమంలో 8 దరఖాస్తులు స్వీకరణ..



శంకర్ పల్లి ఎంపిడిఓ ప్రవీణ్ కుమార్

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం రోజు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 08 దరఖాస్తులు అందినట్టు శంకర్ పల్లి ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. అందులో ఆరు రెవెన్యూకు సంబంధించినవి అని, ఒకటి ఆర్ అండ్ బి శాఖకు సంబంధించిందని, మరొకటి మున్సిపాలిటీకి సంబంధించినదని తెలిపారు. ఇట్టి దరఖాస్తులు సంబంధిత అధికారులకు ఆన్లైన్ లో ట్రాన్స్ఫర్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన 19 మంది అధికారులు అధికారులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం ఉప్పల్ వాయి గ్రామంలో సోమవారం రోజున కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్దన్, బిఆర్ఎస్ మాజీ రైతు బంధు అధ్యక్షులు నారాయణరెడ్డి తల్లి నరసవ్వ ఆదివారం రోజు న చనిపోవడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు, పరామర్శించి ధైర్యంగా ఉండాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో కాసర్ల స్వామి, సుద్దాల లింగం, రవీందర్ రెడ్డి, కొత్తల గంగారం, పర్వారెడ్డి, బి ఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వెటర్నరీ ఇన్స్పెక్టర్ ప్రభుకు మంత్రి వివేక్ చేతుల మీదుగా సత్కారం



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** కాంగ్రెస్ సీనియర్ నేత గడ్డం వెంకటస్వామి 97వ జయంతి సందర్భంగా సోమవారం నగరంలోని రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం తరుపున కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సమాజంలో వివిధ రంగాలలో సేవలందిస్తున్న పలువురికి వారి సేవలను గుర్తించి సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా శంకర్ పల్లికి చెందిన వెటర్నరీ ఇన్స్పెక్టర్ ప్రభు గైక్వాడ్ విశిష్ట సేవలకు గాను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ ప్రభును ఘనంగా సత్కరించి, మెమొంటోను అందజేశారు.

# అంగన్వాడీలో పోషణ మాసం



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం ఉప్పల్వాయి అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసం ప్రోగ్రాం లో భాగంగా తల్లులకు, పిల్లలకు పోషణ లోపం లేకుండా మనకు అందుబాటులో ఉండే చిరుధాన్యాలు, ఆకుకూరలు, అన్ని రకాల పప్పులు, నువ్వుల ఉండలు, రాగి జావా, క్యారెట్, బీట్రూట్ వాడాలని, పోషకాహారం ఉండే పదార్థాలను తినాలని ఈ సందర్భంగా తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివారాణి రాజేందర్, ఉప సర్పంచ్ పర్వారెడ్డి, గ్రామ సెక్రెటరీ అరుణ్, అంగన్వాడీ టీచర్లు సునీత, రాజమణి, లావణ్య, ఆయాలు, తల్లులు, బాలింతలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

**ఎంపీడీవో నాగేశ్వర్ గుప్తా**



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం రైతు వేదికలో నిర్వహించిన ప్రజావాణికి 1 ఫిర్యాదు రెవిన్యూ డిపార్ట్మెంట్కు రావడంతో త్వరలో పరిష్కరిస్తామని తాసిల్దార్ ఉమలత తెలిపారు, ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్ గుప్తా, కరెంటు ఏ ఈ సుధాకర్, వెటర్నరీ అధికారి రామచందర్, మండల వ్యవసాయ అధికారి భాను శ్రీ, అంగన్వాడి సూపర్వైజర్ జ్యోతి, ఉమాదేవి, ఫారెస్ట్ అధికారి సునీత, ఏపీవో ధర్మ రెడ్డి, ఐకెపి ఎపిఎం పద్మావతి, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి గైర్హాజరు..

**ముగ్గురు అధికారులకు షోకాజ్ నోటీసులు**

**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా ప్రజావాణి కార్యక్రమానికి ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరైన ముగ్గురు అధికారులకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. జిల్లా స్థాయిలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉంటుందని నోటీసులో పేర్కొన్నారు. అయితే జిల్లా మత్స్యశాఖ అధికారి ఎం. వెంకయ్య, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ( ఎఫ్ ఏ సి) బి. వల్యా, టి జి ఎస్ ఆర్ టి సి డిపో మేనేజర్ ఎస్. నమ్రత కార్యక్రమానికి గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరు కావడంతో పాటు టూర్ డైరీ అబ్సెన్స్ రిమార్క్స్ సమర్పించకపోవడంపై కూడా వివరణ కోరారు. నోటీసు అందిన తేదీ నుంచి మూడు రోజుల్లోగా వివరణ సమర్పించాలని, లేకపోతే నిబంధనల ప్రకారం తదుపరి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కార్యాలయం హెచ్చరించింది. ప్రజావాణికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలనే విషయంపై జిల్లా యంత్రాంగం కఠిన వైఖరి అవలంబించడం చర్చనీయాంశంగా మారింది.



# సినిమానే జీవితంగా భావించిన సి. పుల్లయ్య

**నేడు చిత్తజల్లు పుల్లయ్య వర్ధంతి**

సి. పుల్లయ్యగా పేరుగాంచిన చిత్తజల్లు పుల్లయ్య (1898 – అక్టోబర్ 6, 1967) మొదటి తరానికి చెందిన తెలుగు సినిమా దర్శకుడు, నటుడు, నిర్మాత. కాకినాడ వాస్తవ్యుడైన ఆయన బి. ఎ చదివి జాతీయ భావం ప్రభావంతో 1920వ దశకంలో కాంగ్రెస్ లో చేరడం కోసం కలకత్తా వెళ్ళాడు. అక్కడ బులుసు సాంబ మూర్తి సలహా మేరకు ఫిలిం లేబరేటరీలో చేరాడు. సినిమా నిర్మాణానికి సంబంధించిన అన్ని శాఖల్లో పనిచేశాడు. తెలుగు చలన చిత్ర పితా మహుడి కుమారుడైన రఘుపతి వెంకయ్య కుమారుడు ఆర్. ఎస్. ప్రకాష్ దగ్గర భీష్మ ప్రతిజ్ఞ (1921) అనే మూకీ సినిమాకు సహాయకుడిగా పని చేశాడు. తర్వాత సినీ నిర్మాణానికి కావలసిన సామాగ్రిని తన స్వస్థల మైన కాకినాడకు తీసుకు వచ్చి ఇంట్లోనే సెట్లు వేసి మార్కండేయ అనే సినిమా తీశాడు. దాన్ని ప్రదర్శించడం కోసం కాకినాడలో స్వంతంగా సిటీ ఎలక్ట్రిక్ అనే పేరుతో టెంటు హాలు కట్టాడు. ఇందులో చాలా మూకీ సినిమాలు ఆడాయి. సినిమా థియేటర్ ను ఒక ఉద్యమం లాగా చేపట్టి గుడారాలు, ప్రొజెక్టర్లూ, కుర్చీలు తీసుకుని ఆంధ్ర రాష్ట్రంలోనే కాక బెంగాల్, ఒరిస్సాలలో కూడా ఊరూరా తిరిగి వాటిని ప్రదర్శించాడు. టాకీ సినిమాలు రాగానే ఆయన దృష్టి చిత్ర నిర్మాణం మీద పడింది. 1933 లో సతీ సావిత్రి సినిమా తీశాడు. అది మంచి విజయం సాధించింది. తర్వాత లవకుశ చిత్రం తీశాడు. అది కూడా మంచి విజయం సాధించింది. కలకత్తాకు చెందిన ఈస్టిండియా ఫిలిం కంపెనీ వారు, ఈయన రూప కల్పనలో అన సూయ, ధృవ విజయం (1936) అనే చిత్రాలు తీసి రెండింటినీ కలిపి ఒకే సినిమాగా విడుదల చేశాడు. చిత్తజల్లు పుల్లయ్య 1898లో కాకినాడలో జన్మించాడు. చిన్న నాటి నుండీ చాలా చురుకైన వాడిగా ఎదిగాడు. 1921 లో ఆయన బి.ఎ.చదువు తున్న సమయంలో కాకినాడలో జాతీయ కాంగ్రెస్ పార్టీ సమావేశాలు జరిగాయి. ఆ సమావేశాలకు వెళ్లిన పుల్లయ్య మీద జాతీయ భావాల ప్రభావం పడింది. వెంటనే ఇంగ్లీషు చదువుకు స్వస్తి చెప్పి, ఖద్దరు దుస్తులు కట్టడం మొదలు పెట్టాడు. కాంగ్రెస్ సేవాదళంలో చేరేందుకు బొంబాయి వెళ్లాడు. రఘుపతి వెంకయ్య, ఆయన కుమారుడు రఘుపతి ప్రకాష్ దక్షిణ భారత దేశంలో మొట్ట మొదటి సినిమా నిర్మాణ సంస్థ 'స్టార్ ఆఫ్ ది ఈస్ట్' ను స్థాపించారు. 1921లో భీష్మ ప్రతిజ్ఞ మూగ చిత్రాన్ని నిర్మించారు. (ఇది మూగచిత్రం గనుక "మొదటి తెలుగువాడి సినిమా" అనడం ఉచితం). ప్రకాష్ దర్శకత్వం వహించడమే కాకుండా ఈ చిత్రంలో భీష్ముని పాత్రను కూడా పోషించాడు. 'డి కాస్టెల్లో' అనే ఆంగ్ల యువతి గంగ పాత్రను ధరించింది. తరువాత ప్రసిద్ధులైన సి.పుల్లయ్య, వై.వి.రావులూ ప్రకాష్ అనుచరులుగా తమ సినీ ప్రస్థానాన్ని ప్రారంభించారు. పుల్లయ్య కాకినాడలో 'భక్త మార్కండేయ' మూకీ చిత్రాన్ని 1925 లో నిర్మించి విడుదల చేసాడు. ఒక తెలుగు వాడు ఆంధ్ర దేశంలో నిర్మించిన మూకీ 'భక్త మార్కండేయ'. ఇందులో పుల్లయ్య యమునిగా నటించాడు. అక్కడ కాంగ్రెస్ నాయకుడు బులుసు సాంబమూర్తి సలహా మేరకు ఫిలిం లేబరేటరీలో చేరాడు. రెండు పూటలా భోజనం పెట్టి, నెలకు ఐదు రూపాయల జీతం ఇచ్చేవారు. అక్కడే సినిమాలకు సంబంధించిన విషయాలన్నీ నేర్చు కున్నాడు. అయితే, కొన్నాళ్లకు ల్యాబ్ దివాళా తీసి మూతపడే పరిస్థితి రావడంతో, పుల్లయ్యకు ఇవ్వాల్సిన జీతం బదులు ఓ సెకండ్ హ్యాండ్ కెమెరా, ప్రొజెక్టరు, ఫిల్ములు ఇచ్చి పంపించి వేశారు నిర్వాహకులు. వాటిని తీసుకుని కాకినాడ చేరాడాయన. కెమెరా చేతిలో ఉండడంతో సినిమా తీయాలన్న కోరిక కలిగింది. తమ ఇంటి రేకుల షెడ్డులో సెట్లు వేసి, 'భక్త మార్కండేయ' సినిమా తీయ డానికి ప్లాన్ వేశారు. అందులో తను యముడిగా కూడా నటించారు. కష్టపడి తీసిన సినిమాను తన ఇంట్లో చీకటి గదిలో గోడ మీద ప్రొజక్ట్ చేసి, తమ వీధిలోని వాళ్లందరికీ చూపించాడు. అయితే, ఆయనకు అది సంతృప్తిని ఇవ్వలేదు. సినిమా మెళకువలను ఇంకా నేర్చుకోవాలన్న తలంపుతో, తన కళాశాల ప్రిన్సిపాల్ రఘుపతి వెంకటరత్నం నాయుడు వద్ద సిఫార్సు లెటర్ తీసుకుని, మద్రాసు బయలు దేరాడు. అక్కడ వెంకట రత్నం నాయుడు సోదరుడు వెంకయ్య నాయుడు అప్పటికే సినిమా నిర్మాణంలో ఉన్నారు. ఆయన కుమారుడు ప్రకాష్ వద్ద పుల్లయ్య అసిస్టెంట్ డైరెక్టర్ గా చేరాడు. రఘుపతి వెంకయ్యకు థియేటర్లు కూడా ఉండేవి. కొన్నాళ్లకు వాటి ప్రదర్శన నిర్వహణను పుల్లయ్యకు అప్ప జెప్పారు. అప్పుడే ఆయన ఆ రంగంలో కూడా అనుభవం సంపాదించారు. టాకీ సినిమా వచ్చిన తర్వాత మళ్లీ పుల్లయ్య దృష్టి సినిమా మీదకు మళ్ళింది. అదే సమయంలో ఈయన గురించి తెలుసుకున్న కలకత్తాలోని ఈస్టిండియా ఫిలిం కంపెనీ వారు, తమ తెలుగు చిత్ర నిర్మాణ విభాగానికి ఇంచార్జ్ గా పుల్లయ్యను ఆహ్వానించారు. ఈస్టిండియా కంపెనీకి ఆయన రూపొందించిన తొలి సినిమా 'సతీ సావిత్రి'. ఆనాటి రంగస్థల ప్రముఖులు వేమూరి గగ్గయ్య, రామతిలకం అందులో నటించారు. తర్వాత దేవకీ బోస్ బెంగాలీలో 'లవకుశ' ప్లాన్ చేస్తుంటే, ఆ సబ్జక్ట్ పుల్లయ్యను ఆకర్షించింది. దాంతో, ఆ కంపెనీకే దీనిని తెలుగులో తీయడానికి రెడీ అయ్యారు పుల్లయ్య. బలిజేపల్లి లక్ష్మీకాంత కవి స్క్రిప్ట్ రాశారు. పారుపల్లి సుబ్బారావు, సీనియర్ శ్రీరంజని ఇందులో సీతారాములుగా నటించారు. రథాలు, సెట్లు, కాస్ట్యూమ్స్ వంటి వాటిని బెంగాలీ వెర్షన్ కి వాడిన వాటినే వాడారు. 1934 లో విడుదలైన సినిమా గొప్ప విజయం సాధించింది. 1963లో ఇదే సినిమాను తన తనయుడు సి.యస్.రావుతో కలిసి పుల్లయ్య పునర్నిర్మించాడు. తెలుగులో తొలి రంగుల చిత్రంగా నమోదైన లవకుశలో ఎన్.టి.రామారావు, అంజలీదేవి సీతారాములుగా నటించగా, నాగయ్య వాల్మీకిగా నటించారు. పుల్లయ్య తీసిన అత్యంత విజయ వంతమైన చిత్రాలలో ఇదీ ఒకటి. పుల్లయ్య భువన సుందరి కథ (1967), భామావిజయం (1967), పరమా నందయ్య శిష్యుల కథ (1966), లవకుశ (1963) కొంత భాగం తీసిన తరువాత పుల్లయ్య ఆరోగ్యం క్షీణించింది. సుందర్ లాల్ నహతా, బి.ఎన్.రెడ్డిల ప్రోత్సాహంతో సి.పుల్లయ్య కుమారుడైన సి.యస్.రావు దర్శకత్వ బాధ్యత చేపట్టి మిగిలిన భాగం పూర్తి చేశాడు.. దేవాంతకుడు (1960), పక్కింటి అమ్మాయి (1953), సంక్రాంతి (1952), అపూర్వ సహోదరులు (1950), వింధ్యరాణి (1948), గొల్లభామ (1947), నారద నారది (1946), బాల నాగమ్మ (1942), మాలతీ మాధవం (1940), వర విక్రయం (1939), మోహినీ భస్మాసుర (1938), సత్య నారాయణ వ్రతం (1938), చల్ మోహన రంగ (1937), దశావతారములు (1937), కాసుల పేరు (1937), అనసూయ (1936), ధ్రువ (1936), కృష్ణ తులాభారం (1935), లవకుశ (1934 సినిమా) (1963), రామదాసు (1933), సావిత్రి (1933) లాంటి సినిమాలలో తన ప్రతిభను ప్రదర్శించారు. 1967, అక్టోబర్ 6 న పుల్లయ్య మద్రాసులో మరణించాడు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# కాంక్రీట్ వనంలో జీవనాదం.. ఆరు దశాబ్దాల ప్రకృతి కావ్యం




ప్రకృతి ఒడిలో ప్రతి ప్రాణీ ఒక పరమాద్భుతం; నిఖిల చరాచర సృష్టిలో మానవుని ఉనికి విశ్వ జీవన సౌరభంలో ఒక చిన్న పరిమళం మాత్రమే. సిమెంటు అరణ్యాలుగా మారిపోతున్న మహానగరాల నడుమ పచ్చని జీవనదారగా, ప్రకృతి--మానవ అనుబంధానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది భాగ్యనగరంలోని నెహ్రూ జూలాజికల్ పార్క్. నవ్యాంధ్ర ప్రగతి పథంలో వన్యప్రాణి సంరక్షణకు, జీవవైవిధ్య వికాసానికి శాశ్వత చిరునామాగా మారిన ఈ అపురూప హరిత క్షేత్రం 1963 అక్టోబర్ 6వ తేదీన లాంఛనంగా ప్రజాబాహుళ్యానికి అంకితమైంది. చారిత్రక బహదూర్‌పురా సమీపంలో, విశాలమైన మీర్ ఆలం చెరువును ఆనుకొని దాదాపు 380 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో విస్తరించిన ఈ జంతుప్రదర్శనశాల, భారతదేశ ప్రథమ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పర్యావరణ దార్శనికతకు ప్రతీకగా ఆయన పేరిట రూపుదిద్దుకుంది. అసలే ప్రాచీన రాతికొండల సహజ సౌందర్యం, దానితోడై అలరారే జలాశయం కలగలిసి వన్యప్రాణులకు ఒక అద్భుతమైన సహజ ఆవాస భూమికను ప్రసాదించాయి.

హైదరాబాద్ నగరంలో జూలాజికల్ పార్క్ ఏర్పాటు వెనుక ఆసక్తికరమైన పూర్వాపరాలు దాగి ఉన్నాయి. నిజాం నవాబుల హయాంలో పాతబస్తీలోని పబ్లిక్ గార్డెన్స్ ప్రాంగణంలో అతి చిన్న జూ ఉండేది. ఇరుకైన గూళ్ళలో, ఇనుప కటకటాల మధ్య మూగజీవులు బందీలుగా జీవించడాన్ని గమనించిన నాటి పాలకులు, అటవీశాఖ నిపుణులు స్వాతంత్ర్యానంతరం వినూత్న ఆలోచన చేశారు. జంతువులను బంధించి ప్రదర్శించే సంకుచిత విధానానికి స్వస్తి పలికి, వాటి సహజ అటవీ పరిసరాలను కళ్ళకు కట్టేలా 'ఓపెన్ ఎన్‌క్లోజర్' పద్ధతిలో విస్తృత వన్యప్రాణి ఉద్యానవనాన్ని తీర్చిదిద్దాలని సంకల్పించారు. 1959లో నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అటవీ విభాగం ఆధ్వర్యంలో పనులు ప్రారంభమై, నాలుగు సంవత్సరాల నిరంతర శ్రమతో 1963లో ఇది సంపూర్ణ రూపాన్ని సంతరించుకుంది. జంతువులకు, మనుషులకు మధ్య ఇనుప కడ్డీలకు బదులుగా లోతైన కందకాలు తవ్వి సహజ అడ్డంకులను నిర్మించడంలో నెహ్రూ జూ అప్పట్లోనే దేశవ్యాప్తంగా నూతన సాంకేతిక ఒరవడిని సృష్టించింది.

ఈ జంతుప్రదర్శనశాల కేవలం విహార స్థలం మాత్రమే కాదు; జీవపరిణామ క్రమాన్ని, జంతుస్వభావాన్ని నిశితంగా బోధించే బహిరంగ విజ్ఞానపీఠం. ప్రస్తుతం ఇక్కడ దాదాపు 160కి పైగా జాతులకు చెందిన రెండు వేలకు పైగా వన్యప్రాణులు, పక్షులు, సరీసృపాలు స్వేచ్ఛా వాతావరణాన్ని అనుభవిస్తున్నాయి. భారత ఉపఖండంలోనే తొలిసారిగా

- **వినోదమే కాదు.. విజ్ఞాన భాండాగారం: ఆదర్శ వన్యప్రాణి క్షేత్రం**
- **హైదరాబాద్ నెహ్రూ జంతుప్రదర్శనశాల.. ప్రకృతి ప్రేమకు ప్రతీక**
- **1963 అక్టోబర్ 6న ప్రారంభమైన నెహ్రూ జూలాజికల్ పార్క్**



1974లో ప్రారంభమైన సఫారీ పార్క్ ఇక్కడి మణిహారం. సుమారు 30 హెక్టార్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సఫారీలో పర్యాటకులు రక్షిత వాహనాలలో పయనిస్తుండగా, గంభీరమైన బెంగాల్ పులులు, ఆసియాటిక్ సింహాలు, ఎలుగుబంట్లు, జింకల మందలు తమ సహజ ఆవాసాల్లో సంచరిస్తూ దర్శనమిస్తాయి. ఈ దృశ్యం సందర్శకులలో కలిగించే రోమాంచిత అనుభూతి వర్ణనాతీతం. జంతువులు పంజరాల్లో ఉండి మనుషులు బయట తిరిగే విధానాన్ని తారుమారు చేస్తూ, మనుషులే రక్షిత వాహనంలో ఉండి జంతువుల స్వేచ్ఛను తిలకించే వైభవం ఇక్కడ సాకారమైంది.

అంతరించిపోతున్న దుస్థితిలో ఉన్న జంతు జాతుల పరిరక్షణలో, కృత్రిమ సంతానోత్పత్తి కేంద్రాల నిర్వహణలో నెహ్రూ జూలాజికల్ పార్క్ నమోదు చేసిన విజయాలు అపూర్వం. భారతీయ ఖడ్గమృగాలు, ఆసియాటిక్ సింహాలు, తెల్ల పులులు, మౌస్ డీర్ (మూషిక జింకలు), గరుడ పక్షులు, మగ్గర్ మొసళ్ల సంతతిని శాస్త్రీయ పద్ధతుల్లో వృద్ధి చేయడంలో ఇక్కడి నిపుణులు విశేష ప్రతిభ కనబరిచారు. ముఖ్యంగా అంతరించిపోతున్న 'మౌస్ డీర్' పునరుత్పత్తి ప్రాజెక్టు విజయవంతమై, వాటిని అమ్రాబాద్, కవ్వాల్ అభయారణ్యాల్లోకి తిరిగి విడుదల చేసిన సంఘటన దేశ పర్యావరణ చరిత్రలోనే ఒక మైలురాయి. అంతేకాక, రాత్రివేళల్లో మాత్రమే సంచరించే నిశాచర జీవుల కోసం 1980వ దశకంలో దేశంలోనే మొట్టమొదటి సారిగా నిర్మించిన 'నాక్టర్నల్ నిమల్ హౌస్' జంతుశాస్త్ర పరిశోధకులను ఎంతగానో ఆకర్షించింది. పగటిపూట రాత్రి వాతావరణాన్ని, రాత్రివేళల్లో వెలుగును సృష్టించి గుడ్లగూబలు, పునుగు పిల్లులు, గబ్బిలాలు వంటి జీవుల అంతరంగ ప్రవర్తనను వీక్షించే సౌలభ్యాన్ని ఇది అందించింది.

విశాలమైన మీర్ ఆలం చెరువు ఒడ్డున ఉన్న చెట్లు ప్రతి శీతాకాలంలో సుదూర దేశాల నుంచి వలస వచ్చే విదేశీ విహంగాలకు విడిదిగా మారుతాయి. పెలికాన్లు, పెయింటెడ్ స్టార్క్స్, హెరాన్లు వంటి లెక్కలేనన్ని జలపక్షులు ఇక్కడి చెట్లకొమ్మలపై గూళ్ళు కట్టుకొని ప్రకృతి సంగీతాన్ని వినిపిస్తుంటాయి. ఈ ఆవరణలోని ప్రశాంత హరితవనాలు నగర కాలుష్యాన్ని హరించి పరిశుద్ధ ప్రాణవాయువును అందించే గొప్ప లంగ్ స్పేస్‌గా పనిచేస్తున్నాయి. చిన్నారులను ఆకట్టుకునే టాయ్ ట్రైన్ ప్రయాణం, డైనోసార్ల నమూనాలతో కూడిన జురాసిక్ పార్క్, ఆక్వేరియం, సీతాకోకచిలుకల పార్క్, నేచురల్ హిస్టరీ మ్యూజియం వంటి విభాగాలు విద్యార్థులకు వినోదంతో కూడిన విజ్ఞానాన్ని సమకూరుస్తున్నాయి. పాఠ్యపుస్తకాల్లో చిత్రాల రూపంలో చూసే వన్యజీవులను రక్తమాంసాలతో, సహజ చేష్టలతో ప్రత్యక్షంగా దర్శించినప్పుడు చిన్నారుల లేత మనస్సుల్లో జీవకారుణ్య భావన దృఢంగా నాటుకుంటుంది.

పర్యావరణ సమతుల్యతలో సమస్త జీవకోటి ప్రాముఖ్యతను గుర్తించడమే నిజమైన సభ్యతా వికాసం. భూమి కేవలం మానవజాతి భోగభాగ్యాల కోసం నిర్మించబడింది కాదు; గడ్డిపోచ మొదలుకొని గజరాజు వరకు ప్రతి ప్రాణికీ ఇక్కడ సమాన జీవన హక్కు ఉంది. ఆహారపు గొలుసులో ఒక చిన్న కొండీ తెగిపోయినా యావత్ పర్యావరణ చక్రం కుప్పకూలిపోతుందన్న శాస్త్రీయ సత్యాన్ని ఈ జంతుప్రదర్శనశాల అనునిత్యం గుర్తుచేస్తుంది. దశాబ్దాలుగా కోట్లాదిమంది సందర్శకులకు సేవలందిస్తూ, అరవై ఏళ్లకు పైబడిన తన ప్రస్థానంలో ఎన్నో తరాల ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసిన ఈ జూ పార్క్ సంరక్షణ మనందరి బాధ్యత. ప్లాస్టిక్ రహిత వాతావరణాన్ని కాపాడుతూ, మూగజీవులను వేధించకుండా, పరిశుభ్రతను పాటిస్తూ పర్యావరణ స్పృహతో మెలగడమే మనం ప్రకృతికిచ్చే నిజమైన గౌరవం. ఆకుపచ్చని ఆశల సమ్మేళనంగా, సహజీవన సౌందర్య ప్రతీకగా విరాజిల్లుతున్న హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్ తరతరాలకూ ప్రకృతి పరిమళాలను పంచుతూ చిరంజీవిగా వర్ధిల్లుతోంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494













# అర్ష్‌దీప్ ఇన్?



వెస్టిండీస్‌పై వన్డే సిరీస్‌ను నెగ్గిన టీమ్ఇండియా.. ఇప్పుడు టీ20 సిరీస్‌పై దృష్టి పెట్టింది. ఐదు టీ20ల సిరీస్ రేపటి నుంచే ప్రారంభం కానుంది. ఫాస్ట్‌బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ తుది జట్టులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. మంగళవారం లఖ్‌నవూలో జరిగే తొలి టీ20లో అతడికి చోటు ఖాయంగా కనిపిస్తోంది. బుమ్రాకు విశ్రాంతి ఇవ్వడంతో పేస్ దళాన్ని అర్ష్‌దీప్ నడిపించనున్నాడు.
అర్ష్‌దీప్ సెప్టెంబరు 22న జపాన్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో ఆడాడు. అయితే వర్షం కారణంగా మ్యాచ్‌ను ఐదు ఓవర్లకు కుదించడంతో బౌలింగ్ చేసే అవకాశం రాలేదు. ఆసియా క్రీడల్లో శ్రీలంక, పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌ల్లోనూ అతడికి తుది జట్టులో చోటు దక్కలేదు. దీంతో తాజాగా వెస్టిండీస్‌తో జరిగే టీ20 సిరీస్‌లో అతడు బరిలోకి దిగే అవకాశాలు కని పిస్తున్నాయి. అతడితో పాటు మయాంక్ యాదవ్ లేదా ప్రిన్స్ యాదవ్‌లో ఒకరికి చోటు దక్కే అవకాశముంది. ఇక ఆసియా క్రీడల ఫైనల్లో పాకిస్థాన్‌పై రవి బిష్ణోయ్ మూడు ఓవర్లలో 44 పరుగులిచ్చి వికెట్ సాధించలేకపోయాడు. దీంతో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు తుది జట్టులో చోటు దక్కే అవకాశం ఉంది.

**ఓజా అధ్యక్షతన జట్టు ఎంపిక సమావేశం..**
న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లే భారత జట్టు ఎంపిక కోసం ఈ వారం జరిగే కీలక సమావేశానికి ప్రజ్ఞాన్ ఓజాఅధ్యక్షత వహించనున్నాడు. అజిత్ అగార్కర్ పదవీ కాలం ముగియడంతో ఓజా కొంత కాలం పాటు తాత్కాలికంగా సెలక్షన్ కమిటీకి నాయకత్వం వహించనున్నాడు. అక్టోబరు 22 నుంచి నవంబరు 27 వరకు సాగే ఈ పర్యటనలో టీమ్ఇండియాఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టులు ఆడనుంది.



# ప్రయోగాలకు ముగింపు

వన్డే ప్రపంచకప్‌కు ఎక్కువ సమయం లేదని, ఇకపై ప్రయోగాలు చేయమని టీమ్ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. ప్రపంచకప్ జట్టులో ఉండే అవకాశమున్న ఆటగాళ్లకే వచ్చే సిరీస్ నుంచి రెగ్యులర్‌గా అవకాశాలు కల్పిస్తామని అతడు స్పష్టం చేశాడు. వెస్టిండీస్‌తో సిరీస్‌లో టీమ్ఇండియా అనేక మంది ద్వితీయశ్రేణి ఆటగాళ్లతో బరిలోకి దిగిన సంగతి తెలిసిందే. అయితే బుమ్రా, అర్షదీప్, కుల్‌దీప్, అక్షర్ పటేల్ గైర్హాజరీలో జట్టు బౌలింగ్ బలహీనంగా కనిపించింది. పైగా రెండో వన్డే సందర్భంగా పేస్‌బౌలర్ ప్రసిద్ధ్‌కృష్ణ గాయపడ్డాడు. ఈ నేపథ్యంలో విండీస్‌తో మూడో వన్డే అనంతరం గిల్ స్పందించాడు. ''ప్రయోగాలకు పెద్దగా సమయం లేదు. వచ్చే సిరీస్ నుంచి ఆటగాళ్లందరూ అందుబాటులో ఉంటారని ఆశిస్తున్నా. ఇక ప్రపంచకప్‌లో ఆడే జట్టుతోనే ఆడడం ప్రారంభించాలనుకుంటున్నాం'' అని అతడు చెప్పాడు. ప్రధాన బౌలర్లు తరచూ తుది జట్టులో లేకపోతుండడం అసహనం కలిగిస్తోందని అతడు అన్నాడు. కోరుకున్న బౌలింగ్ లైనప్‌తో బరిలోకి దిగలేకపోతుండడం దురదృష్టకరమని గిల్ చెప్పాడు. అయితే ప్రధాన బౌలర్ల గైర్హాజరీ వల్ల.. కొత్త బౌలర్లకు సత్తా చాటుకునేందుకు అవకాశం లభిస్తుందని అభిప్రాయపడ్డాడు. వెస్టిండీస్‌తో సిరీస్‌లో పవర్‌ప్లే, ఆఖరి ఓవర్లలో బౌలింగ్ తమను దెబ్బతీసిందని గిల్ పేర్కొన్నాడు. ''పవర్‌ప్లేలో బంతితో బాగా ఆరంభించకపోతే మధ్య ఓవర్లలో వికెట్లు తీయడం కష్టం. పవర్‌ప్లే లేదా మధ్య ఓవర్లలో వికెట్లు తీయకపోతే ఆట తీవ్రత పూర్తి భిన్నంగా ఉంటుంది'' అని అతడు చెప్పాడు.



# రెస్టే ది ఇరానీ కప్

ప్రతిష్ఠాత్మక ఇరానీ కప్‌ను రెస్ట్ ఆఫ్ ఇండియా సొంతం చేసుకుంది. ఆ జట్టు రంజీ ఛాంపియన్ జమ్మూకశ్మీర్‌పై 167 పరుగుల భారీ విజయం సాధించి, ఆటలో ఇంకో రోజు మిగిలుండగానే కప్పు దక్కించుకుంది. నాలుగో రోజు, ఆదివారం 279 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన జమ్మూకశ్మీర్ ఘోరంగా విఫలమైంది. పేసర్లు ముకేశ్ కుమార్ (6/33), ఆకాశ్ దీప్ (3/25) ధాటికి విలవిల్లాడిన ఆ జట్టు 111కే కుప్పకూలింది. ఓపెనర్లు కమ్రాన్ ఇక్బాల్ (32), శుభమ్ ఖజూరియా (36) శుభారంభాన్నిచ్చారు. అయితే ఈ జోడీ విడిపోయాక ఇన్నింగ్స్ గాడి తప్పింది. వరుసగా వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది. అబ్దుల్ సమద్ (20) కాసేపు నిలిచాడు. ఈ త్రయం మినహా ఎవరూ రెండంకెల స్కోరు కూడా చేయలేదంటేనే అర్థం చేసుకోవచ్చు రంజీ ఛాంపియన్ ఎంత పేలవంగా ఆడిందో. ఆ జట్టులో మొత్తం నలుగురు బ్యాటర్లు డకౌటయ్యారు. అంతకుముందు 306/8తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన రెస్ట్ మరో 13 పరుగులు జత చేసి ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ రవిచంద్రన్ స్మరణ్ 135 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఆఖరి వికెట్‌గా వెనుదిరిగాడు. తొలి ఇన్నింగ్స్‌లో రెస్ట్ 237 పరుగులు చేయగా.. జమ్మూకశ్మీర్ 278కి ఆలౌటైంది.

# పాకిస్తాన్ టీ20 జట్టుకు కొత్త కెప్టెన్



పాకిస్తాన్ క్రికెట్‌లో కీలక మార్పు చోటు చేసుకుంది. ఆ దేశ టీ20 జట్టుకు కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేశారు. ఏషియన్ గేమ్స్‌లో తాత్కాలిక సారథిగా వ్యవహరించిన సాహిబ్‌జాదా ఫర్హాన్‌కు పూర్తి స్థాయి టీ20 కెప్టెన్‌గా బాధ్యతలు అప్పజెప్పారు. త్వరలో స్వదేశంలో శ్రీలంకతో జరిగే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌తో ఫర్హాన్ ఛార్జ్ తీసుకుంటాడు. ఇప్పటివరకు పాక్ టీ20 కెప్టెన్‌గా సల్మాన్ అఘా వ్యవహరించాడు.
శ్రీలంకతో టీ20 సిరీస్ అక్టోబర్ 9, 11, 13 తేదీల్లో జరుగుతుంది. ఈ సిరీస్ కోసం పాక్ జట్టును కూడా ప్రకటించారు. ఈ జట్టులో స్టార్ ప్లేయర్లు బాబర్ ఆజమ్, షాహీన్ షా అఫ్రిదికి చోటు దక్కలేదు. అయితే ఈ ఇద్దరినీ ఆతర్వాత పాక్‌లోనే జరిగే వన్డే ట్రై సిరీస్‌కు ఎంపిక చేశారు. ఈ ట్రై సిరీస్ అక్టోబర్ 18 నుంచి ప్రారంభమవుతుంది. ఈ టోర్నీలో పాక్, శ్రీలంకతో పాటు ఇంగ్లండ్ పాల్గొంటుంది. వన్డే టోర్నీలో పాక్ కెప్టెన్‌గా షాహీన్ అఫ్రిది వ్యవహరిస్తాడు.
శ్రీలంకతో టీ20 సిరీస్‌కు పాక్ జట్టుసాహిబ్‌జాదా ఫర్హాన్ (కెప్టెన్), అబ్దుల్ సమద్, అబ్రార్ అహ్మద్, అరాఫత్ మిన్హాస్, ఫఖర్ జమాన్, హసన్ నవాజ్, మహ్మద్ ఇమ్రాన్, ఖ్వాజా నఫే (వికెట్ కీపర్), మాజ్ సదాఖత్, నసీమ్ షా, రజావుల్లా, సైమ్ అయూబ్, సల్మాన్ మిర్జా, షాదాబ్ ఖాన్, సుఫియాన్ ముకీమ్.
వన్డే ట్రై సిరీస్ కోసం పాక్ జట్టుషాహీన్ అఫ్రిది (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, అరాఫత్ మిన్హాస్, బాబర్ ఆజమ్, ఫహీమ్ అష్రఫ్, ఫఖర్ జమాన్, హారిస్ రౌఫ్, హసన్ నవాజ్, ఘాజీ ఘోరి (వికెట్ కీపర్), నసీమ్ షా, రజావుల్లా, సాద్ బైగ్ (వికెట్ కీపర్), సైమ్ అయూబ్, సల్మాన్ అలీ ఆఘా, షాదాబ్ ఖాన్, సుఫియాన్ ముకీమ్



## కసరత్తు ఇప్పుడే మొదలవ్వాలి

తాజాగా ముగిసిన ఆసియా క్రీడల్లో భారత్‌కు సానుకూలాంశాలతో పాటు ప్రతికూలాంశాలు ఉన్నాయని భారత షూటర్ అభినవ్ బింద్రా అభిప్రాయపడ్డాడు. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌ను దృష్టిలో ఉంచుకుని భారత క్రీడారంగ పనితీరు వ్యవస్థను బలోపేతం చేయడం అత్యావశ్యకమని ఈ ఒలింపిక్ మాజీ ఛాంపియన్ తెలిపాడు. ''భారత అథ్లెట్లకు, టీమ్ఇండియాకు అభినందనలు. ఎన్నో త్యాగాలు చేసి తమ బిడ్డల్ని క్రీడల్లో ప్రోత్సహించిన తల్లిదండ్రుల పట్ల అపార గౌరవం ఏర్పడింది. కోచ్‌లకు, సహాయ బృందానికి, ప్రభుత్వానికి ధన్యవాదాలు. కొందరు అథ్లెట్లు అంచనాల్లేకుండా బరిలో దిగి అద్భుత ప్రదర్శన చేశారు. మరికొందరు స్టార్లు నిరాశపరిచారు. క్రీడల్లో విఫలమవడం సమస్య కాదు. కానీ వైఫల్యాల నుంచి ఎంత త్వరగా పుంజుకున్నామన్నదే ప్రధానం. రాబోయే లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు ఇప్పటినుంచే కసరత్తు మొదలుపెట్టాలి'' అని బింద్రా పేర్కొన్నాడు.

# ఆసీస్‌తో సిరీస్‌కు ముందు ఇంగ్లండ్ కీలక నిర్ణయం

ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు ముందు ఇంగ్లండ్ జట్టు కీలక నిర్ణయం తీసుకుంది. గత యాషెస్ సిరీస్‌కు ముందు చేసిన తప్పిదాన్ని మళ్లీ చేయకూడదని నిర్ణయించుకుంది. గత యాషెస్ సిరీస్‌కు ముందు ఇంగ్లండ్ ఎలాంటి ప్రాక్టీస్ మ్యాచ్ ఆడకుండా నేరుగా బరిలోకి దిగింది. ఫలితంగా 14తో సిరీస్‌లో ఘోర పరాజయాన్ని ఎదుర్కొంది.
ఈసారి ఆస్ట్రేలియా పర్యటనలో అలాంటి తప్పిదం జరగకుండా ఇంగ్లండ్ ముందుగా జాగ్రత్త పడింది. ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు ముందు వెస్ట్రన్ ఆస్ట్రేలియా XIతో 50 ఓవర్ల వార్మప్ మ్యాచ్ ఆడేందుకు అంగీకరించింది. నవంబర్ 7న పెర్త్‌లోని వాకా మైదానంలో ఈ మ్యాచ్ జరగనుంది. కాగా, హ్యారీ బ్రూక్ నాయకత్వంలోని ఇంగ్లండ్ జట్టు నవంబర్‌లో ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ఈ పర్యటనలో తొలుత మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్, ఆ తర్వాత ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది.
వన్డే సిరీస్‌కు ముందు ఆస్ట్రేలియా పరిస్థితులకు అలవాటు పడేందుకు వెస్ట్రన్ ఆస్ట్రేలియా XIతో వార్మప్ మ్యాచ్ ఆడనుంది. నవంబర్ 13న పెర్త్‌లో తొలి వన్డే జరగనుంది. ఆ తర్వాత నవంబర్ 15న అడిలైడ్‌లో రెండో వన్డే, నవంబర్ 18న హోబర్ట్‌లో మూడో వన్డే జరగనున్నాయి. అనంతరం ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ నవంబర్ 21 నుంచి డిసెంబర్ 2 వరకు జరగనుంది. ఆస్ట్రేలియా సిరీస్ కోసం ఇంగ్లండ్ జట్టును ఇంకా ప్రకటించలేదు. ఇటీవల శ్రీలంక, భారత్‌పై వన్డే సిరీస్‌లు గెలిచిన బలమైన జట్టుతో ఆస్ట్రేలియాకు వెళ్లే అవకాశం ఉంది.





# మరింత మెరుగైతేనే!

- **భవిష్యత్‌లో భారత్ క్రీడా శక్తిగా ఎదిగే అవకాశం**
- **ఆసియా క్రీడల్లో ఫర్వాలేదనిపించిన మనోళ్ల ప్రదర్శన**

పదేళ్ల తర్వాత దేశంలో అత్యున్నత క్రీడా సంబరం ఒలింపిక్స్ నిర్వహించాలని పట్టుదలగా ఉన్న కేంద్ర ప్రభుత్వం... అప్పటి వరకు దేశంలో క్రీడా సంస్కృతిని మరింత పెంపొందించాలని భావిస్తోంది. వచ్చే దశాబ్దకాలంలో అంతర్జాతీయ పోటీల్లో నిలకడైన ప్రదర్శనలు చేస్తూ... 2036 ఒలింపిక్స్ కల్లా ప్రపంచంలో టాప్-10 క్రీడా దేశాల్లో ఒకటిగా నిలవాలని దృఢనిశ్చయంతో ఉంది. కానీ తాజా ఆసియా క్రీడల్లో భారత్‌కు లభించిన పతకాలు, కనబరిచిన ప్రదర్శన చూస్తే మాత్రం లక్ష్యానికి చాలా దూరంలోనే ఉన్నట్లు స్పష్టమవుతోంది.
ఈసారి ఆసియా క్రీడల సన్నాహాల కోసం భారత క్రీడాకారులపై కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఏకంగా రూ. 702 కోట్లు వెచ్చించింది. అందుబాటులో ఉన్న అత్యుత్తమ సౌకర్యాలు కల్పించింది. కోరుకున్న చోట శిక్షణకు పంపించింది. మేటి కోచ్‌లను సమకూర్చింది. దాంతో వరుసగా రెండోసారి పతకాల్లో భారత్ 'సెంచరీ' కొడుతుందని అందరూ భావించారు. కానీ భారత క్రీడాకారులు జపాన్ ఆసియా క్రీడల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారనే చెప్పాలి.
2023 ఆసియా క్రీడల్లో భారత్ మొత్తం 106 పతకాలు సాధించగా... ఈసారి మనకు 85 పతకాలే వచ్చాయి. క్రితంసారి కంటే 21 పతకాలు తక్కువగా వచ్చాయి. షూటర్లు, అథ్లెట్లు, షట్లర్లు అంచనాలను అందుకోలేకపోయారు. క్రితంసారి సాధించిన నాలుగో స్థానాన్ని భారత్ నిలబెట్టుకున్నా... భవిష్యత్‌లో ఆసియాలో టాప్-3లోకి రావాలంటే మాత్రం భారత్ తమ ప్రదర్శనకు మరింత పదును పెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. -సాక్షి, క్రీడావిభాగం
గత ఆసియా క్రీడల్లో పతకాల శతకం నమోదు చేసిన భారత్... తాజా ఏషియన్ గేమ్స్‌లో మాత్రం సెంచరీకి చేరువగా రాలేకపోయింది. 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలతో మొత్తంగా 85 పతకాలు సాధించింది. భారత్‌తోపాటు ఉజ్బెకిస్తాన్ కూడా 21 స్వర్ణాలు సాధించినా... రజత, కాంస్య పతకాల్లో భారత్‌దే పైచేయి కావడంతో గత నాలుగో స్థానాన్ని నిలబెట్టుకోగలిగింది. గత ఆసియా క్రీడలతో పోల్చుకుంటే ఈసారి మనకు 21 పతకాలు తక్కువ లభించాయి. కేవలం ఆసియా క్రీడల్లోనే కాకుండా ఒలింపిక్స్‌లోనూ పతకాల పట్టికలో చైనా, జపాన్, దక్షిణ కొరియా దూసుకెళ్తుంటే... 2036 కల్లా ప్రపంచంలోనే టాప్-10కు చేరాలనుకుంటున్న భారత్ మాత్రం ఆశించిన పురోగతి సాధించలేకపోతోంది.
ఈసారి క్రీడల్లో మనవాళ్లు 100 పతకాల్లోపే పరిమితం కావడం వెనక ప్రధానంగా అథ్లెటిక్స్, షూటింగ్ వైఫల్యమే కారణంగా కనిపిస్తోంది. భారీ అంచనాల మధ్య జపాన్‌లో అడుగుపెట్టిన మన షూటర్లు తీవ్రంగా నిరాశ పరిచారు. 30 మంది షూటర్ల బృందం కేవలం 3 స్వర్ణాలు, 8 రజతాలు, 4 కాంస్యాలతో 15 పతకాలకే పరిమితమైంది. హాంగ్జౌ క్రీడల్లో మన షూటర్లు 7 స్వర్ణాలు, 9 రజతాలు, 6 కాంస్యాలు సాధించడంతోనే భారత్ సెంచరీ మార్క్ అందుకోగలిగింది. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన మనూ భాకర్ రిక్తహస్తాలతో వెనుదిరగగా... మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో భారత్‌కు ఒక్క పతకం కూడా దక్కలేదు. ట్రాప్‌లో నీరూ ధండా మూడు పతకాలతో మెరవడం సంతృప్తినివ్వగా... హైదరాబాదీ షూటర్ కైనన్ చెనాయ్ ఆకట్టుకున్నాడు.

**'పరుగు' మందగమనం...**
ఇక అథ్లెటిక్స్‌లో కూడా భారత్ పతక వేట మందగించింది. పోటీలు ప్రారంభానికి ముందే స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా గాయం కారణంగా ఏషియన్ గేమ్స్‌కు దూరం కాగా... గత రెండు ఆసియా క్రీడల్లో స్వర్ణాలు సాధించిన షాట్‌పుటర్ తజిందర్ పాల్ సింగ్ తూర్ ఈసారి వెండికే పరిమితమయ్యాడు. లాంగ్‌జంప్‌లో మురళీ శ్రీశంకర్, హైజంప్‌లో సర్వేశ్ కుశారే కూడా రజతాలే సాధించారు.

## చూపులతో గుచ్చి గుచ్చి..



**ముంబై, అక్టోబర్ 5 :** గ్లామర్ ఫొటోషూట్లతో తరచూ అభిమానుల దృష్టిని ఆకర్షించే నటి ఆయేషా ఖాన్ మరోసారి హాట్ టాపిక్‌గా మారారు. తాజాగా ఆమె షేర్ చేసిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. బ్లాక్ స్కూప్ నెక్ క్యామిసోల్‌లో కనిపించిన ఆయేషా.. పెయింట్ బ్రష్‌ను నోట పట్టుకుని ఇచ్చిన ఇంటెన్స్ పోజు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మెస్సీ బన్, ముక్కుపుడకతో సింపుల్ లుక్‌ను ఎంచుకున్న ఆమె.. గోల్డెన్ లైటింగ్ మధ్య జుట్టుతో ఆడుకుంటూ కెమెరాకు పోజిచ్చారు. సహజమైన మేకప్, స్టూడియో వాతావరణం ఫొటోలకు గ్లామర్‌తో పాటు కళాత్మకమైన టచ్‌ను తీసుకొచ్చాయి. మరో ఫొటోలో ఆయేషా పూర్తి భిన్నమైన మూడ్‌లో కనిపించారు. గ్రే ప్యాంట్ ధరించి నేలపై కూర్చుని ఫొటో బుక్‌ను తిరగేస్తూ బ్లాక్ అండ్ వైట్ ఫ్రేమ్‌లో పోజిచ్చారు. ఒకవైపు బోల్డ్ లుక్.. మరోవైపు క్యాండిడ్ స్టైల్‌తో సాగిన ఈ ఫొటోషూట్ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం ఆయేషా చేతిలో కొత్త సినిమా ప్రాజెక్టులపై స్పష్టమైన ప్రకటన లేదు. అయినప్పటికీ ఫొటోషూట్లు, సామాజిక మాధ్యమాల్లో తనదైన స్టైల్‌తో అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు.



# తెరపై థ్యాంక్స్ కార్డ్

### ఎమోషనల్ అయిన 'దృశ్యం 3' దర్శకుడి భార్య!

**ముంబై, అక్టోబర్ 5 :** సాధారణంగా భర్త తీసిన సినిమాను థియేటర్‌లో చూడటం ఏ భార్యకైనా సంతోషానిచ్చే విషయమే. కానీ, వెండితెరపై భర్త తనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పడం చూస్తే ఆ భావోద్వేగం మాటల్లో వర్ణించలేనిది. సరిగ్గా అలాంటి అనుభూతినే పొంది కన్నీటి పర్యంతమయ్యారు బాలీవుడ్ నటి శివాలికా ఒబెరాయ్. తన భర్త, ప్రముఖ దర్శకుడు అభిషేక్ పాఠక్ తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'దృశ్యం: ది కన్‌క్లూజన్' (దృశ్యం 3) సినిమా చూస్తుండగా ఆమె థియేటర్‌లోనే తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. సినిమా పూర్తయ్యాక ఎండ్ టైటిల్స్ పడుతున్న సమయంలో.. దర్శకుడు అభిషేక్ పాఠక్ తన భార్య శివాలికాకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ తెరపై ఓ ప్రత్యేక నోట్ వేశారు. సినిమా నిర్మాణ ప్రయాణంలో, కష్ట సమయాల్లో ఆమె అందించిన నిరంతర మద్దతును అందులో గుర్తుచేసుకున్నారు. బిగ్ స్క్రీన్‌పై ఆ థ్యాంక్స్ కార్డ్‌ను చూసి ఉద్వేగానికి లోనైన శివాలికా, ఆ క్షణాలను వీడియో తీసి తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అభిమానులతో పంచుకున్నారు. "తెరపై ఆ నోట్ చూడగానే నా కళ్లలో నీళ్లు తిరిగాయి. ఈ సినిమా ప్రయాణం మొదలుపెట్టినప్పుడు మనం ఎన్నో త్యాగాలు చేశాం, తీవ్రమైన కష్టాలను ఎదుర్కొన్నాం. రోజుల తరబడి ఒకరికొకరం దూరంగా గడపాల్సి వచ్చింది. కానీ నీ పనితనంపై నాకు మొదటినుంచీ పూర్తి నమ్మకం ఉంది. ఈ రోజు నీ కష్టాన్ని ప్రపంచమంతా మెచ్చుకుంటుంటే ఆ శ్రమ అంతా మర్చిపోయాను. భవిష్యత్తులో మన కూతురు 'ఆరికా' కూడా ఈ సినిమా చూసి నిన్ను చూసి గర్వపడుతుంది. నీలాంటి వ్యక్తికి భార్యనైనందుకు నాకెంతో గర్వంగా ఉంది" అని శివాలికా తన పోస్టులో భావోద్వేగంగా రాసుకొచ్చారు. కాగా, అక్టోబరు 2న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన 'దృశ్యం 3' చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లతో ప్రభంజనం సృష్టిస్తోంది. తొలి మూడు రోజుల్లోనే భారత్‌లో ఏకంగా రూ.175 కోట్లు కొల్లగొట్టి, రూ.200 కోట్ల క్లబ్ దిశగా అత్యంత వేగంగా పయనిస్తోంది. ఈ చిత్రంలో అజయ్ దేవ్‌గన్, శ్రియ, ఇషితా దత్తా, టబు, రజత్ కపూర్, జైదీప్ అహ్లావత్, ప్రకాశ్ రాజ్ కీలక పాత్రల్లో నటించగా.. అలోక్ జైన్, అజిత్ అంధారే, కుమార్ మంగత్ పాఠక్, అభిషేక్ పాఠక్ సంయుక్తంగా నిర్మించారు.

# 'రామాయణ' సెట్‌లో భారీ అగ్నిప్రమాదం

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్, టాలెంటెడ్ హీరోయిన్ సాయిపల్లవి జంటగా నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక భారీ బడ్జెట్ చిత్రం 'రామాయణ'. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో రణ్‌బీర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తుండగా.. కన్నడ స్టార్ యశ్ రావణుడి పాత్రలో కనిపించనున్నారు.ప్రస్తుతం ముంబైలోని గోరేగావ్ ఫిల్మ్ సిటీలో ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ క్రమంలో చిత్రబృందానికి ఊహించని షాక్ తగిలింది. సోమవారం మధ్యాహ్నం 4:02 గంటలకు ఫిల్మ్ సిటీలోని రిలయన్స్ మీడియా వర్క్స్, ప్రైమ్ ఫోకస్ వెనుక భాగంలో అగ్ని ప్రమాదం సంభవించినట్లు ముంబై ఫైర్ విభాగం వెల్లడించింది. ప్రైమ్ ఫోకస్ స్టూడియో వెనుక ఉన్న వంద అడుగుల తాత్కాలిక సెట్‌లోని పీసీఆర్ యూనిట్‌లో ఈ మంటలు చెలరేగాయి. ఎలక్ట్రిక్ వైరింగ్, కేబుల్స్, తలుపులు, చెక్కపలకలు, ఏసీ యూనిట్లు, బాంబులు, ప్లాస్టిక్ సామగ్రి, సౌండ్ సిస్టమ్స్, షూటింగ్ పరికరాలు ఈ అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న ముంబై ఫైర్ సిబ్బంది, పోలీసులు, బీఎంసీ వార్డ్ కంట్రోల్, 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సాయంత్రం 4:55 గంటల కల్లా మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. 'రామాయణ' సెట్టే కాకుండా, పక్కనే ఉన్న స్టూడియోలలో షూటింగ్ జరుపుకుంటున్న ఎంటీవీ 'హస్టిల్ 5', 'పతి పత్నీ ఔర్ పంగా 2' సెట్లు కూడా ఈ ప్రమాదం కారణంగా దెబ్బతిన్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం.. 'పతి పత్నీ ఔర్ పంగా 2' సెట్‌లో మొదలైన మంటలు క్రమంగా 'హస్టిల్ 5' సెట్ వైపు కూడా వ్యాపించినట్లు తెలుస్తోంది. అయితే ఈ రెండు సెట్లకు ఎంత మేర నష్టం వాటిల్లిందనే దానిపై ఇంకా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.





# మూడు బ్రేకప్స్.. ఆసుపత్రి పాలయ్యా

### సుప్రీత సంచలన నిజాలు!

**హైదరాబాద్, అక్టోబర్ 5 :** ప్రముఖ నటి సురేఖ వాణి కుమార్తెగా సినీ లోకానికి పరిచయమై, తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్న నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ సుప్రీత తన వ్యక్తిగత జీవితంపై సంచలన విషయాలను వెల్లడించారు. ఇటీవల ఓ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె.. తన ప్రేమకథలు, ఎదుర్కొన్న తీవ్ర మానసిక క్షోభ, ఆరోగ్య సమస్యల గురించి భావోద్వేగంగా పంచుకున్నారు. తన జీవితంలో ఇప్పటివరకు మూడు బ్రేకప్స్ జరిగాయని సుప్రీత తెలిపారు. చిన్నతనంలో కలిగిన మొదటి క్రష్‌ను తాను సీరియస్‌గా తీసుకోలేదని, అయితే రెండో రిలేషన్‌షిప్ మాత్రం తన జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిందని పేర్కొన్నారు. దాదాపు రెండున్నరేళ్ల పాటు సాగిన ఆ బంధం తనకు ఎంతో మానసిక వేదనను (ట్రామా) మిగిల్చిందని, ఆ ప్రభావంతో ఇప్పటికీ జన సమూహాల్లోకి వెళ్లినప్పుడు భయాందోళనలు, కంగారు కలుగుతుంటాయని చెప్పారు. ఆ మానసిక ఒత్తిడి నుంచి బయటపడేందుకు ప్రస్తుతం వైద్యుల సలహాతో మందులు కూడా వాడుతున్నట్లు వెల్లడించారు. ఇక మూడో రిలేషన్‌షిప్‌లో ఎదురైన చేదు అనుభవాలను వివరిస్తూ.. భాగస్వామిలోని తీవ్రమైన అనుమానం, ఈగో తట్టుకోలేకపోయానని సుప్రీత చెప్పారు. షూటింగ్ ప్రాంతాల్లో ఎవరితో మాట్లాడుతున్నావ్? ఎందుకు మాట్లాడుతున్నావ్? అంటూ వేధించేవారని, నియంత్రించే ఈ ధోరణి తన కెరీర్‌పై కూడా ప్రభావం చూపడంతో ఆ బంధం నుంచి బయటకు వచ్చేశానని తెలిపారు. వరుస బ్రేకప్స్ వల్ల తీవ్ర ఒత్తిడికి గురై బరువు గణనీయంగా 52 కిలోలకు తగ్గిపోయానని, ఆరోగ్యం క్షీణించి ఆసుపత్రి పాలవ్వాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ సమస్యలను అధిగమించడానికి మెడిటేషన్, క్రమమైన చికిత్స తీసుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com